ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శనివారం 2 నవంబరు 2024

దీపం వెలుగులు

ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రారంభం

» మహిళల్లో హర్షాతిరేకాలు
» జిల్లాలో 3,76,924 మంది అర్హులు



గాజువాకలో 'దీపం-2' పథకాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ప్రధానంగా 'సూపర్ సిక్స్'లో ఒకటైన ఉచిత వంట గ్యాస్ పథకాన్ని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా విశాఖ జిల్లాలోని గాజువాకలో స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉచిత సిలిండర్ల పంపిణీని ప్రారంభించారు. ఉచిత వంటగ్యాస్ పథకం 'దీపం-2' ప్రారంభం ఒక పండుగలా జరిగింది. ఈ సందర్భంగా మహిళల మోముల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ పథకం కింద వంట గ్యాస్ బుకింగ్‌ను రెండు రోజుల క్రితమే ప్రారంభించగా, శుక్రవారం నుంచి పంపిణీ ప్రారంభించారు.

దీపం-2 పథకం కింద ఉచిత సిలిండర్లకు జిల్లాలో 3,76,924 మంది అర్హులు ఉన్నట్టు అధికారులు లెక్క తేల్చారు. వీరికి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తారు. వాస్తవానికి తెల్లకార్డుదారుల సంఖ్య అధికంగానే ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ... మిగతా 4వ పేజీలో

చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు



ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం పేదలందరికీ లాభం చేకూరుస్తుంది. సూపర్ సిక్స్‌లో పేర్కొన్న ఉచిత సిలిండర్ హామీని కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగునెలల్లోనే అమలు చేయడం చాలా ఆనందంగా ఉంది. మాలాంటి పేదవర్గాలకు మూడు సిలిండర్ల డబ్బులు ఎంతగానో ఉపయోగపడతాయి.

- స్వప్న, గాజువాక

మాలాంటి పేదవర్గాలకు ఎంతో ఉపయోగం



ఇప్పటివరకూ ఎవరూ ఇలాంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టలేదు. ఇది మాలాంటి పేద కుటుంబాలకు ఉపయోగపడే పథకం. ఈ పథకం పెట్టడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలన్నింటికీ మేలు జరుగుతుంది. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం పేదల కోసం మంచి మంచి పథకాలు అమలు చేస్తోంది. - దివ్య

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

» విమానాశ్రయం నుంచి శ్రీకాకుళం పర్యటనకు పయనం

గోపాలపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పర్యటన నిమిత్తం నగరానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఉదయం 11.20 గంటలకు విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, గ్రేటర్ కమిషనర్ పి.సంపత్‌కుమార్, జేసీ మయూర్ అశోక్, ఆర్డీవో పి.శ్రీలేఖ, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం బయలుదేరి వెళ్లారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు శుక్రవారం మధ్యాహ్నం విశాఖపట్నం విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

నేడు నగరానికి చంద్రబాబు రాక

» జిల్లా అభివృద్ధిపై కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం
» రుషికొండపై భవనాన్ని సందర్శించే అవకాశం

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం విశాఖపట్నం వస్తున్నారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన ఆయన... శనివారం విజయనగరం జిల్లాలో కార్యక్రమం ముగించుకుని హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.05 గంటలకు నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద దిగుతారు. అక్కడి నుంచి కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని రెండు గంటల వరకూ విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో జిల్లా అభివృద్ధిపై రెండు గంటలకు సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు సమావేశం ముగించుకొని నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద గల హెలీపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి వెళతారు. అక్కడ 5.05 గంటలకు విమానంలో విజయవాడ బయలుదేరి వెళతారు.

ప్రధాన అంశాలపైనే సీఎం సమీక్ష

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో ప్రధాన శాఖలపైనే శనివారం సమీక్షించనున్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ, భోగాపురం విమానాశ్రయం ప్రధాన అంశాలుగా చేర్చారు. ఇవి కాకుండా మొత్తం 40 శాఖల నుంచి సంక్షిప్త నివేదికలు కోరారు. ఐటీ, పర్యాటకం, రహదారుల నిర్మాణం, తదితర అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రుషికొండపై జగన్ రూ.500 కోట్లతో నిర్మించిన భవనాన్ని ఆయన ఈ సందర్భంగా పరిశీలించే అవకాశం ఉంది. అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫ్లైఓవర్లా?, ఎలివేటెడ్ కారిడారా??

ఏదైనా సరే... పనులు తక్షణం ప్రారంభించాల్సిందే

» ఇప్పుడు మళ్లీ అధ్యయనాలంటే కష్టం
» మరో ఏడాదిన్నరలో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చే అవకాశం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నానికి సంబంధించి ఇటీవల కాలంలో వెలువడుతున్న ప్రకటనలు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఎప్పటి నుంచో ఉన్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టకుండా మెరుగైన సౌకర్యాలు పేరుతో అభివృద్ధి పనులను వాయిదా వేయడాన్ని ఎవరూ హర్షించలేకపోతున్నారు. వాస్తవిక దృష్టితో ఉపయోగపడే పనులు చేపట్టాలనే వాదన గట్టిగా వినిపిస్తోంది. విశాఖపట్నానికి అంతర్జాతీయ విమాన సర్వీసులు, గంటకు 150 కి.మీ. వేగంతో దూసుకుపోయే రైళ్లు వస్తున్నా... నగర ప్రజలకు నరకం చూపిస్తున్న రహదారులపై ఫ్లైఓవర్లు మాత్రం రావడం లేదు. వీటిపై పాలకులు ఎందుకో ఆసక్తి కనిపించడం లేదు.

» ఇప్పుడున్న పరిస్థితుల్లో నగరం నుంచి గంటన్నర ప్రయాణం
» ఫ్లైవోవర్లు నిర్మించకుంటే ప్రయాణికులకు తిప్పలే

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఉపయోగపడే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు శరవేగంతో జరుగుతున్నాయి. 2026 మార్చి నాటికి తొలి వాణిజ్య విమానాన్ని టేకాఫ్ చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే సరిగ్గా 16 నెలల సమయం ఉంది. అది ప్రారంభమైతే విశాఖ విమానాశ్రయంలో పౌర విమాన సేవలు ఆగిపోతాయి. దానిని పూర్తిగా నేవీ అవసరాలకే ఉపయోగించుకుంటారు. పక్కనే ఉన్న రాజమండ్రి వెళ్లాలన్నా, సింగపూర్ పోవాలన్నా భోగాపురం విమానాశ్రయానికి వెళ్లక తప్పదు. విశాఖ నుంచి అక్కడికి 50 కి.మీ. దూరం. ప్రస్తుతం ఎన్ఏడీ జంక్షన్ నుంచి భోగాపురం వెళ్లాలంటే గంటన్నర సమయం పడుతోంది. టాక్సీకి రూ.2,500 నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. ఇది దూరాభారం. విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు ఇక్కడి నుంచి విమానంలో వెళ్లడానికి ఎంత సమయం పడుతుందో, కారులో భోగాపురం విమానాశ్రయానికి వెళ్లడానికి అంతే సమయం పడుతుంది. ఇప్పుడు విమాన ప్రయాణికులు నగరంలో ఎక్కడి నుంచైనా కేవలం అరగంటలో రూ.500 ఖర్చుతో విమానాశ్రయానికి వెళ్లిపోతున్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే సమయం మరో గంట అదనంగా వెచ్చించాలి. రానుపోను టాక్సీ ఖర్చులకు అధమంగా రూ.5 వేలు పెట్టుకోవాలి. ఈ సమస్యకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సరైన పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉంది. భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యే సమయానికి ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తక్కువ సమయంలో అక్కడకు వెళ్లగలిగే ఏర్పాట్లు చేయాలి. ఈ సమస్య ... మిగతా 4వ పేజీలో

ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో అగ్ని ప్రమాదం

» లావాదేవీలు నిలిపివేత



రామ్‌నగర్‌లోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో అగ్ని ప్రమాద దృశ్యం

మహారాణిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామ్‌నగర్‌లో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో గురువారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో స్వల్ప ప్రమాదం సంభవించింది. దీపావళి సందర్భంగా సెలవు కావడంతో మూసి ఉన్న బ్యాంకు నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. బ్యాంక్ సిబ్బంది సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహకారంతో తలుపులు తెరిచారు. అప్పటికే బ్యాంకు లోపల దట్టమైన పొగలు వ్యాపించి ఉన్నాయి. మంటలను వెంటనే అగ్నిమాపక సిబ్బంది అదుపుచేశారు. ప్రమాదంలో సుమారు పది కంప్యూటర్లు, ప్రింటర్లు కాలిపోయాయి. బ్యాంక్ ఆవరణ నల్లటి పొగతో మసకబారింది. ఈ కారణంగా శుక్రవారం బ్యాంకులో లావాదేవీలు నిలిచిపోయాయి.



నగరంలో బాణసంచా వెలుగులు

బాణసంచా పొగ

కమ్మేసిన కాలుష్యం

» దీపావళి నాడు నగరమంతటా భారీగా పెరిగిన ధూళి
» పీఎం-10 గరిష్ఠంగా జ్ఞానాపురంలో 307గా నమోదు
» పీఎం-2.5 జీవీఎంసీ కార్యాలయం వద్ద 165...
» పీఎం 10...100 మిల్లీగ్రామ్స్, పీఎం 2.5...60 మిల్లీగ్రామ్స్‌కు మించకూడదు

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని గురువారం రాత్రి బాణసంచా పొగ కమ్మేసింది. వాయు కాలుష్యం భారీగా పెరగడంతో గాలి నాణ్యత పూర్తిగా తగ్గిపోయింది. సాధారణ రోజులతో పోలిస్తే నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో గాలిలో ధూళి కణాలు రెట్టింపు కంటే అధికంగా నమోదయ్యాయి.

దీపావళి పండుగ రోజు సాయంత్రం ఆరు నుంచి పది గంటల వరకు ప్రజలు భారీఎత్తున బాణసంచా కాల్చారు. వాటి నుంచి వెలువడిన దుమ్ము, ధూళి, పొగ నగరాన్ని కమ్మేశాయి. ధూళి కణాలు (పీఎం-10, పీఎం-2.5) అసాధారణ స్థాయిలో నమోదయ్యాయి. గడిచిన ... మిగతా 4వ పేజీలో

సందడిగా దీపావళి

» భారీగా బాణసంచా అమ్మకాలు
» సుమారు రూ.10 కోట్ల మేర వ్యాపారం జరిగి ఉంటుందని చెబుతున్న వ్యాపారులు

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళిని నగరవాసులు ఉత్సాహంగా జరుపుకున్నారు. గడిచిన ఏడాదితో పోలిస్తే బాణసంచా ఎక్కువే కాల్చారు. ఈ ఏడాది 15 నుంచి 20 శాతం మేర విక్రయాలు పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. గతంలో నగరం మొత్తమ్మీద వేయి నుంచి 1,500 మంది వ్యాపారులు ఉండేవారు. ఈ ఏడాది సుమారు మూడు వేల మంది బాణసంచా విక్రయించారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్, ఆల్వార్‌దాస్ కాలేజీ మైదానంలో దుకాణాలు ఏర్పాటుచేసిన సుమారు 500 మందికి భారీగానే వ్యాపారం జరిగింది. ఒక్కో స్టాల్‌లో కనీసం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు మందుగుండు సామగ్రిని విక్రయించారు. మిగిలినచోట్ల చిన్నా, చితకా వ్యాపారులు కనీసం రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర విలువజేసే సరకును అమ్మారు. జిల్లా అంతటా సుమారు రూ.10 కోట్ల రూపాయలు విలువజేసే ... మిగతా 4వ పేజీలో

పంచారామాల దర్శనానికి ఆర్టీసీ స్పెషల్ ప్యాకేజీ -లోపలి పేజీల్లో

ఐఐటీ బీహెచ్‌యూలో సత్తాచాటిన శృతి -6లో

ఎంవీపీ ఎస్.ఐ.పై సస్పెన్షన్ వేటు

» మహిళను హింసించిన సంఘటనలో సీపీ చర్యలు
» సి.ఐ.పై కూడా శాఖాపరమైన చర్యలకు ఆదేశాలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో అనుమానితురాలివంటూ మహిళను స్టేషన్‌కు తీసుకువచ్చి తీవ్రంగా కొట్టిన ఎంవీపీ స్టేషన్ క్రైమ్ విభాగం ఎస్.ఐ. ఎస్.జగదీష్‌ను శుక్రవారం కమిషనర్ శంఖబ్రత బాగ్చి సస్పెండ్ చేశారు. ఇదే వ్యవహారంలో ద్వారకా జోన్ సబ్ డివిజన్ క్రైమ్ సి.ఐ. బంగారుపాపపై కూడా శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. కొద్దిరోజుల క్రితం సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో ఉంటున్న వైద్యురాలు ఒకరు తమ ... మిగతా 4వ పేజీలో

రాష్ట్ర స్థాయికి ఉక్కు ఉద్యమం

» కార్మికులకు మాత్రమే పరిమితం కారాదు, ప్రజా పోరాటంగా మలిచి ముందుకు తీసుకువెళ్లాలి
» రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు
» 7న విజయవాడలో వామపక్షాల సమావేశం
» త్వరలో చలో అమరావతి వంటి కార్యక్రమాలు నిర్వహణ



పౌర గ్రంథాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వామపక్షాలు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

సీతంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభిప్రాయపడ్డారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం వామపక్షాలు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం, కర్మాగారానికి సొంత గనులు కేటాయించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడం, సెయిల్‌లో విలీనం' అనే అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ... మిగతా 4వ పేజీలో

పంచ గ్రామాల భూ సమస్యపై సీఎంకు లేఖ

సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూ సమస్యపై సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం లేఖ రాసింది. 1998కి ముందు ఈ సమస్య లేదని, పెందుర్తి, చినగదిలి తహసీల్దార్లు, సింహాచలం దేవస్థానం పేరిట జారీ చేసిన పట్టా వల్ల సమస్య ఉత్పన్నమైందన్నారు. ఆ పట్టాకు ముందు 1903లో గిల్‌మేన్ సర్వే మాత్రమే ప్రామాణికంగా ఉండేదని, కానీ పట్టా వల్ల కొంతమంది హక్కుదారులను కూడా ఆక్రమణదారులుగా పేర్కొన్నారని తెలిపారు. 2014లో ప్రభుత్వ ఆదేశాలతో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ కూడా 1988లో రెవెన్యూ అధికారులు దేవస్థానానికి జారీ చేసి పట్టా సక్రమం కాదని తేల్చిందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కూటమి ఇచ్చిన హామీ మేరకు సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పరిశీలన


బాలికతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమకుమార్

సాగర్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ వాడపాలెం జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలను డీఈఓ ఎస్. ప్రేమకుమార్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతుల నిర్వహణను పరిశీలించి, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను గమనించారు. అనంతరం చినగదిలి ఎంఈఓ కార్యాలయాన్ని సందర్శించారు.

'ఇళ్ల కూల్చివేతపై విచారణ జరపాలి'

భీమునిపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల కూల్చివేతపై విచారణ జరపాలని ఆనందపురం మండలం లొడగలవానిపాలెం భూసాగు లబ్ధిదారుల కమిటీ సభ్యులు ఆర్‌డీఓను కోరారు. శుక్రవారం వారు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేసి, ఏవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.పద్మ, మీసాల గౌరమ్మ, ఎం. నారాయణ, అంగటి అప్పయ్యమ్మ కళావతి పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న తిరువీధి

సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆశ్వీయుజమాస అమావాస్య పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనులు, పండితుల పారాయణల నడుమ మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. మార్గం పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలిచ్చి స్వామి వారిని స్వాగతించారు.

రాష్ట్రస్థాయికి ఉక్కు ఉద్యమం

... 3వ పేజీ తరువాయి

ముఖ్య వక్తగా విచ్చేసిన కె.రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం కార్మికులకు మాత్రమే పరిమితం కాకూడదని, దీన్ని ప్రజా పోరాటంగా మలిచి ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఢిల్లీలోనూ పోరాట కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారని గుర్తుచేస్తూ...వారిపై ఇప్పుడు ఒత్తిడి తీసుకురావలసి ఉందన్నారు. ఈ నెల 7న విజయవాడలో వామపక్షాల సమావేశం ఏర్పాటుచేశామని, ఇందులో ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకువెళ్లడంపై చర్చిస్తామని తెలిపారు. 'చలో అమరావతి' వంటి కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. ఎన్నికల ముందుకంటే ఆ తరువాతే ఉక్కు పరిశ్రమకు ప్రైవేటీకరణ ముప్పు పెరిగిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్లాంటు కుంటుపడేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటవుతుందంటున్న మిట్టల్ స్టీల్‌ప్లాంటుకు ముడి సరకుతో పాటు అవసరమైన అన్ని వనరులూ సమకూర్చడానికి సిద్ధమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో చొరవ చూపకపోవడమేమిటని రామకృష్ణ ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే చంద్రబాబు చరిత్రహీనుడిగా మిగిలిపోతారని హెచ్చరించారు. దీన్ని కాపాడకుండా ఎన్ని మంచి పనులు చేసినా ప్రజలు గుర్తించరన్న విషయాన్ని గ్రహించాలన్నారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న ఎంపీలు ఆ విషయంపై ప్రధానిని కలుసుకునేందుకు చొరవ చూపడం లేదన్నారు. సుదీర్ఘకాలంగా జరుగుతున్న పోరాటం వల్లే విశాఖ ఉక్కును ఇంతవరకు కాపాడుకుంటూ రాగలిగామని, దీన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటు ఆర్థిక మండళ్ల (ఎస్‌ఈజడ్) మాదిరిగా ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు పెట్టాలంటూ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించడం సరికాదన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏవీ వర్మరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, వామపక్ష, పౌరప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే కూటమి లక్ష్యం

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» వలందపేటలో సిలిండర్లు పంపిణీ


వలందపేటలో గ్యాస్ సిలిండర్లు పొందిన మహిళలతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 2,684 కోట్ల వ్యయం చేస్తోందని తెలిపారు. శుక్రవారం ఆయన రెండవ వార్డు పరిధి వలందపేటలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత సిలిండర్ల వల్ల మహిళలకు కొంత ఆర్థిక దన్ను లభిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందని, కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని సమన్వయం చేసుకుంటూ వెళుతుందన్నారు. విశాఖను ఐటీ హబ్‌గా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, పదివేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ ప్రేమ ప్రసన్నరాణి, కూటమి నాయకులు కోరాడ రాజబాబు, కంటుభుక్త రామానాయుడు, పంచకర్ల సందీప్, కార్పొరేటర్ జి. చిన్నికుమారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆనందపురం : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంటా అన్నారు. శుక్రవారం ఆయన బిపికళ్లాలు, ఆనందపురం పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ప్రతి గ్రామానికి ప్రధాన రహదారులకు అనుసంధానం చేస్తూ సీసీ రోడ్లు వేస్తున్నామని చెప్పారు. త్వరలో కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డులు, పక్కా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్, ఎంపీపీ శారదా ప్రియాంక, ఎంపీడీవో జానకి, సర్పంచ్ కోన లక్ష్మి, నాయకులు తాత్రాజు అప్పారావు, గంగ్రెడ్డి స్వామి నాయుడు, రమేశ్, కోరాడ వైకుంఠరావు పాల్గొన్నారు.

గురుకులాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్


గురుకులం ఆవరణలో మొక్క నాటుతున్న భాస్కర్

సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని బీసీ గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో కృషి చేస్తున్నట్టు బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి పోలా భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన సింహాచలం గురుకులంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 106 గురుకులాల్లో 28 చోట్ల సొంత భవనాలు ఉండగా, మిగిలిన వాటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు బ్రిడ్జి కోర్సులు ప్రవేశ పెట్టనున్నామని, అన్ని సబ్జెక్టులకు ప్రత్యేక క్లాస్‌లు ఇప్పించాలని నిర్ణయించామన్నారు. టెన్త్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. విద్యార్థి దశ నుండే సేవా భావం అలవర్చేందుకు ఎన్‌సీసీతో పాటు రెడ్‌క్రాస్ విభాగాన్ని కూడా ఈనెల 14 నుంచి ప్రారంభించాలని నిర్ణయించామన్నారు.విద్యార్థులు, ఉపాధ్యాయుల పనితీరును ఎల్లవేళలా పరిశీలించేందుకు క్లాస్ వర్క్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌ను ప్రవేశ పెడతామన్నారు. అనంతరం ఆయన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సమావేశంలో సింహాచలం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమామోహిని, ఉత్తరాంధ్ర జోన్‌కు చెందిన 39 గురుకులాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


మృతి చెందిన అభిషేక్ వర్మ

పద్మనాభం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రేవిడి గ్రామంలో ఉన్న రిసార్టులో పుట్టిన రోజు వేడుకలకు వచ్చిన యువకుడు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందాడు. పద్మనాభం సీఐ శ్రీధర్ తెలిపిన వివరాలు ప్రకారం..ఎంవీపీ కాలనీకి చెందిన బండ్రెడ్డి అభిషేక్ వర్మ (24) తన మిత్రుడు రోహిత్ పుట్టిన రోజు వేడుకలకు మిగిలిన మిత్రులతో కలిసి గత నెల 30న రాత్రి రేవిడిలోని రిసార్టుకు వెళ్లారు. రాత్రంగా మిత్రులు మందు, విందుతో గడిపి, స్విమ్మింగ్ పూల్‌లో స్నానానికి దిగారు. అందులో ఈత కొడుతుండగా అభిషేక్ వర్మ ఒక్కసారిగా కుప్పకూలి నీటిలో మునిగిపోయాడు. మిగిలిన వారు అతడ్ని స్విమ్మింగ్ పూల్‌లో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడు తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా 30న రాత్రి ఈ ఘటన జరిగినా గురువారం సాయంత్రం వరకు పోలీసులు వివరాలు గోప్యంగా ఉంచడానికి ప్రయత్నించడంతో మృతిపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. నగరంలో ఎన్నో రిసార్టులు, రెస్టారెంట్లు ఉండగా ఇక్కడకు వచ్చి యువకుడు మృతి చెందడంతో ఎవరైనా పథకం ప్రకారం హత్య చేశారా అన్న అనుమానానికి తావిస్తోంది. మీడియాను కూడా సాయంత్రం వరకు ఘటనా స్థలానికి రానివ్వకుండా చేయడంతో అనుమానాలకు బలం చేకూరుస్తోంది. గతంలో ఈ స్టేషన్ పరిధిలో జరిగిన పలు నేరాల విషయాన్ని కూడా అధికారులు గోప్యంగా ఉంచడానికి ప్రయత్నించడంతో నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భీమిలిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

భీమునిపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది ఫ్రీడమ్ కప్ జూనియర్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్ గౌరవాధ్యక్షుడు, టీడీపీ యువనేత గంటా రవితేజ తెలిపారు. శుక్రవారం భీమిలి ఫుట్‌బాల్ మైదానంలో ఏబీసీ ఆధ్వర్యంలో ఫ్రీడమ్ కప్ 2024 క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏబీసీ సంస్థ 28 ఏళ్లుగా పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. వచ్చే ఏడాది 1,2,3,4 వార్డుల్లో వున్న 6,7,8 తరగతుల విద్యార్థులకు కూడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏబీసీ సంస్థ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్, అక్కరమాని రామునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, జడ్సీ ప్రసన్న వాణి లత, గాడు అప్పలనాయుడు, యార్లగడ్డ జీవన్‌కుమార్, కంటుభుక్త రామానాయుడు, కనకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గంటాకు అనంతుని పవిత్రాలు అందజేత

పద్మనాభం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనంత పద్మనాభుడి పవిత్రోత్సవాల్లో స్వామివారికి సమర్పించిన పవిత్రాలను దేవస్థానం అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు వేదాశీర్వచనం అందించి, స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రంతో పాటు తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నగేశ్ కుమార్, బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు మహేశ్, ఆలయ అర్చకులు పవన్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐదో వార్డులో పింఛన్లు పంపిణీ

కొమ్మాది, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఐదో వార్డులో కార్పొరేటర్ మొల్లి హేమలత శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు,కొండపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం

భీమునిపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రరాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగాన్ని మరువలేమని పలువురు కొనియాడారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవో జయప్రద, ఈవోఆర్డీ రమేష్‌నాయుడు, తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అలాగే పట్టణంలోని పొట్టి శ్రీరాములు పార్క్‌లో వున్న ఆయన విగ్రహానికి సారగ్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ అధ్యక్షుడు, అడ్వకేట్ కోట మల్లికార్జునరావు పాలాభిషేకం చేసి, నివాళి అర్పించారు.

పద్మనాభం : పద్మనాభంలో గాయత్రీ యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ మెడికల్ విభాగం ఏపీ కన్వీనరు రూపాకులు రవికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై నరకాసుర వధ


మాడవీధిలో నరకాసుర వధ నిర్వహిస్తున్న పురోహితులు

సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో నరకాసుర వధ ఉత్సవాన్ని గురువారం రాత్రి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం భక్తులకు దర్శనాలు నిలిపివేసిన తరువాత రాత్రి ఆరాధన జరిపి ఉత్సమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులతో సర్వాభరణాలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. దానికి ఎదురుగా నరకుని దారు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్వామి, అమ్మవార్లకు ఉపచారాలు సమర్పించిన తరువాత నరకుడు మహావిష్ణువు అవతారమైన స్వామిపై దండెత్తినట్టుగా ఘట్టాన్ని ఆవిష్కరించారు. కొంతసేపటికి స్వామివారి శరఘాతానికి నరకుని శిరస్సు తెగిపడినట్టు చేశారు. అనంతరం ఆలయ సిబ్బంది బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహితులు కరి సీతారామాచార్యులు, సింహగిరి గ్రామానికి చెందిన యువత పాల్గొన్నారు.

ఎంవీపీ ఎస్.ఐ.పై సస్పెన్షన్ వేటు

... 3వ పేజీ తరువాయి

ఇంట్లో బంగారం పోయిందని, పనిమనిషిపై అనుమానం ఉందంటూ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ముందస్తు విచారణ ఏమీ లేకుండా సదరు మహిళను స్టేషన్‌కు తీసుకువచ్చి, తీవ్రంగా కొట్టారు. ఆమె కాలు విరిగిపోయింది. విషయం సీపీ వరకూ చేరడంతో ప్రాథమిక విచారణ అనంతరం ఎస్ఐను సస్పెండ్ చేశారు. సి.ఐ.పై కూడా శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా 7995095799 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా సీపీ పేర్కొన్నారు.

కమ్మేసిన కాలుష్యం

... 3వ పేజీ తరువాయి

గురువారంతో పోలిస్తే దీపావళి రోజున గాలి నాణ్యత గణనీయంగా తగ్గినట్టు అధికారుల పరిశీలనలో తేలింది. పీఎం-10 అత్యధికంగా జ్ఞానాపురంలో 307గా నమోదు కాగా, మిందిలో 301, పోలీస్ బ్యారెక్స్ వద్ద 274, ఎంవీపీ రైతుబజార్ వద్ద 266, జీవీఎంసీ కార్యాలయం వద్ద 249 నమోదైంది. పీఎం 2.5 జీవీఎంసీ కార్యాలయం వద్ద 165గా నమోదు కాగా, పోలీస్ బ్యారెక్స్ వద్ద 131, ఎంవీపీ రైతుబజార్ వద్ద 122, మిందిలో 121గా నమోదైంది. అంతర్జాతీయ ప్రమాణాలు ప్రకారం పీఎం 10..100 మిల్లీగ్రామ్స్, పీఎం 2.5..60 మిల్లీగ్రామ్స్‌కు మించకూడదు. కానీ, దీపావళి పండగ తరువాత ఈ రెండు కేటగిరీల్లోనూ రెండు, మూడు రెట్లు అధికంగా నమోదుకావడం గమనార్హం. ఇదిలావుంటే గడిచిన మూడు, నాలుగేళ్లతో పోలిస్తే ఈ ఏడాది పీఎం 10, పీఎం 2.5 నమోదులో పెద్దగా తేడాలు లేనట్టు పర్యావరణ ఇంజనీర్ పి.ముకుందరావు తెలిపారు.

ప్రాంతం	పీఎం10 (గడిచిన గురువారం)	పీఎం-2.5 (గడిచిన గురువారం)	పీఎం-10 (దీపావళి రోజు)	పీఎం-2.5 (దీపావళి రోజు)
మింది	121	45	301	121
ఆటోనగర్	122	44	241	84
పోలీస్ బ్యారెక్స్	124	66	274	131
ఈఎస్ఐ హాస్పిటల్	121	54	132	107
సీతమ్మధార	85	36	221	97
జ్ఞానాపురం	134	53	307	108
పెదగంట్యాడ	129	57	193	93
రాంకీ	115	46	149	76
ఎంవీపీ రైతుబజార్	89	32	266	122
జీవీఎంసీ కార్యాలయం	189	52.2	233	110.4

సందడిగా దీపావళి

... 3వ పేజీ తరువాయి

బాణసంచా వ్యాపారం జరిగి ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. వ్యాపారుల సంఖ్య పెరగడంతో ఆశించిన స్థాయిలో లాభాలు రాలేదని పేర్కొంటున్నారు. అయితే, గడిచిన ఏడాది మిగిలిపోయిన సరకును కూడా క్లియర్ చేసుకోగలిగామని ఒక స్టాల్ నిర్వాహకుడు తెలిపారు. ఏదిఏమైనా గడిచిన మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది దీపావళి అమ్మకాలు పెద్ద ఎత్తున జరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

దీపం వెలుగులు

... 3వ పేజీ తరువాయి

ఒక ఇంట్లో రెండేసి కుటుంబాలు ఉన్నందున వారిని ఒక్కరిగానే పరిగణనలోకి తీసుకున్నారు. భీమిలి నియోజకవర్గంలో 88,987 మంది, విశాఖ తూర్పులో 62,640, విశాఖ పశ్చిమలో 44,461, విశాఖ దక్షిణంలో 41,971, విశాఖ ఉత్తరంలో 39,745, గాజువాకలో 71,111, పెందుర్తిలో 28,009 మంది అర్హులు ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించగానే సుమారుగా 45 వేల మంది సిలిండర్లు బుక్ చేసుకున్నారు.

వీరికి దశల వారీగా సిలిండర్లు పంపిణీ చేస్తారు. వీటిని డెలివరీ తీసుకున్నప్పుడు లబ్ధిదారులు సిలిండర్‌కు నగదు చెల్లించాలి. అక్కడి నుంచి 48 గంటల్లో ఆ మొత్తం వారి బ్యాంక్ ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుంది.


ముఖ్యమంత్రికి విరాళం చెక్కును అందిస్తున్న బీసీ సంఘం నాయకులు

వరద బాధితులకు రూ. 10 లక్షల విరాళం

ఆనందపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని వరద బాధితులకు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రూ. 10 లక్షల విరాళం ప్రకటించింది. ఈ మొత్తాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు బీసీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. జనగణనలో కుల గణన జరిపి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నోటీసు బోర్డులు ప్రదర్శించాలని, ఎన్నికల హామీ మేరకు చట్ట సభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించాలని కోరారు.

వివాదాస్పదంగా స్టెల్లా మేరిస్ విద్యార్థినుల ర్యాలీ


ప్లకార్డులతో విద్యార్థినులు

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేవ్ దీపావళి పేరుతో నగరంలో ఒక క్రిస్టియన్ పాఠశాల యాజమాన్యం ర్యాలీ నిర్వహించడం వివాదాస్పదమైంది. విద్యార్థినులతో ర్యాలీ చేపట్టడాన్ని హిందూ మతానికి చెందిన ఒకరు తప్పుబట్టారు. పండుగ వద్దని విద్యార్థినులతో ర్యాలీ ఎలా చేయిస్తారని...అతను నిలదీస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో హిందూ, క్రైస్తవ సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే... దీపావళికి ముందురోజు...అక్టోబరు 30న మర్రిపాలెం వుడా కాలనీలోని స్టెల్లా మేరిస్ స్కూల్ నిర్వాహకులు విద్యార్థినులతో కాలనీ నుంచి జాతీయ రహదారి మీదుగా రిలయన్స్ పెట్రోల్‌బంకు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్కూల్ బ్యానర్, ప్లకార్డులు పట్టుకుని సేవ్ ఎర్త్...హ్యాపీ దీపావళి అని నినాదాలు చేస్తూ దాదాపు 100 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. అదే సమయంలో అటువైపు వెళుతున్న ఓ హిందూ అభిమాని...నిర్వాహకులను ప్రశ్నించారు. తన సెల్ ఫోన్‌తో వీడియో తీశారు.విద్యార్థి దశ నుంచే హిందూ పండుగల పట్ల విషబీజాలు నాటుతున్నారని, మీరు ఏ మతం వారని ప్రశ్నించారు. పండుగ వద్దంటూ చిన్నారులతో ర్యాలీ ఎందుకు తీయిస్తున్నారని నిలదీశారు. డిసెంబరు 25న మొక్కలను తొలగించి మీరు ప్రార్థనలు చేయడం లేదా...అప్పుడు పర్యావరణం దెబ్బతినదా, కేవలం దీపావళి పండుగ రోజున మాత్రమే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందా... అని ప్రశ్నించారు. విద్యార్థినులతో జైశ్రీరామ్ అంటూ ఆయన నినాదాలు చేయించారు. ఈ వీడియో వైరల్ కావడంతో పలు హిందూ సంఘాల నాయకులు గురువారం మర్రిపాలెం స్కూల్ ఎదురుగా బాణసంచా కాల్చడం వివాదాన్ని పెద్దది చేసింది. అదే సమయంలో నగరంలో ముఖ్యమంత్రి పర్యటన ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిపై ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నాయి. పాఠశాల యాజమాన్యం నిర్వహించిన ర్యాలీపై మండల విద్యాశాఖాధికారి సోమేశ్వరరావును వివరణ కోరగా దీనిపై ఫిర్యాదు రాలేదని, ఆ వీడియో చూడలేదన్నారు. వీడియోను పరిశీలించి, అవసరమైతే పాఠశాల యాజమాన్యానికి నోటీసులిచ్చి వివరణ కోరతామన్నారు.

చంద్రబాబు పర్యటన కోసం కలెక్టరేట్ ముస్తాబు


విద్యుత్ దీపాలతో కలెక్టరేట్ అలంకరణ

మహారాణిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం జిల్లా అధికారులతో సీఎం సమీక్షిస్తారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా పోలీసు అధికారులు కలెక్టరేట్‌ను తమ ఆధీనంలోకి తీసుకొని భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యాలయం బయట వ్యర్థాలను తొలగించి, పరిశుభ్రత-పచ్చదనం పనులు చేపట్టారు. కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కంబాలకొండలో స్వచ్ఛభారత్

ఎండాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో కంబాల కొండ ట్రెకింగ్ ప్రాంతంలో శుక్రవారం జంగిల్ క్లీనింగ్ చేపట్టారు. పోర్టు సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు, జిల్లా అటవీ శాఖ సిబ్బంది పాల్గొని, పరిసరాలను శుభ్రం చేశారు. తొలుత ట్రెకింగ్‌తో కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలను తొలగించారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

తగరపువలస, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

గీతంలో జాతీయ ఐక్యతా దినోత్సవం

సాగర్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని గీతం వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం అధికారి జి. మహేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్. గోపీనాథ్, బయోటెక్నాలజీ విభాగం అధిపతి డాక్టర్ శరత్‌బాబు, ప్రొఫెసర్ మురళీమోహన్, పాల్గొన్నారు.

ఫ్లైఓవర్లా?, ఎలివేటెడ్ కారిడారా??

... 3వ పేజీ తరువాయి

పరిష్కారానికి జాతీయ రహదారిపై 12 ఫ్లైఓవర్లు నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. కేంద్రానికి పంపితే నిధులు కూడా మంజూరయ్యాయి. టెండర్ల దశలో ఆగిపోయాయి.

ఎలివేటెడ్ కారిడార్ పేరుతో జాప్యం

విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టు కోసం పదేళ్ల నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గాజువాక నుంచి కొమ్మాది వరకు నడపాలనేది ఆలోచన. ఈ ప్రాంతాల మధ్య మెట్రో రైలును ఉపయోగించుకునే వారి సంఖ్య చాలా స్వల్పం. వాస్తవంగా చెప్పాలంటే ఆదాయం పెద్దగా రాదు. ఈ ప్రాజెక్టుకు కేంద్రంతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం సగం మొత్తం భరించాల్సి ఉంది. దీని వ్యయం రూ.14 వేల కోట్ల పై మాటే. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో దీనిని గుదిబండగానే గుర్తించాల్సి ఉంది. ఈ మెట్రో ప్రాజెక్టు డీపీఆర్‌కు కేంద్రం నుంచి ఇంకా ఆమోదం లభించలేదు. గత ప్రభుత్వం గద్దె దిగే ముందు ఫైల్ ఢిల్లీకి పంపింది. దానిని మళ్లీ ఇప్పుడు మార్చాలని కూటమి నేతలు భావిస్తున్నారు. ఫ్లైఓవర్లకు, మెట్రో రైలు ప్రాజెక్టుకు కనెక్టివిటీ ఉండేలా ఎలివేటెడ్ కారిడార్ వేస్తామని చెబుతున్నారు. వీటి అధ్యయనానికి, డీపీఆర్‌లకు చాలా సమయం పడుతుంది. ఈలోగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే విమాన ప్రయాణికులకు ఇబ్బందులు మొదలవుతాయి. నగరంలో ఏవైతే ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లుగా గుర్తించారో వాటిపై ఇంకా అదనపు ఒత్తిడి పెరుగుతుంది. ఈ సమస్యకు సరైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంది.

ఖాళీగా ఐటీ టవర్లు

విశాఖపట్నంలో అనేక ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నాయి. రుషికొండ ఐటీ పార్కులో 2019లో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు మిలీనియం టవర్-1 ప్రారంభించారు. అందులో నాలుగు అంతస్తులు ఐదేళ్లుగా ఖాళీగానే ఉన్నాయి. పక్కనే మరో టవర్-2 నిర్మించారు. అందులో ఎనిమిది అంతస్తులు ఖాళీగా ఉన్నాయి. సుమారు 3.5 లక్షల చ.అ. విస్తీర్ణం ఖాళీగా ఉంది. కాపులుప్పాడలో నాటి ఐటీ మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధతో 175 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఐటీ లేఅవుట్‌లో స్థలాలను అప్పటి నుంచి ఎవరికీ కేటాయించలేదు. విశాఖలో గత టీడీపీ హయాంలోనే అదానీ డేటా సెంటర్‌కు భూములు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి, మళ్లీ భూములు ఇచ్చింది. శంకుస్థాపన జరిగి రెండేళ్లయింది. డేటా సెంటర్ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన స్టార్టప్ విలేజ్ వెలవెలబోతోంది. రుషికొండపై రూ.500 కోట్లతో జగన్ నిర్మించిన ప్యాలెస్ కూడా ఖాళీగానే ఉంది.వందల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలు వృథాగా ఉన్నాయి. వీటిని తక్షణమే వినియోగంలోకి తెచ్చే నిర్ణయాలు తీసుకోవలసి ఉంది. ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వలేదు.

☛ సంక్షిప్తంగా..

అంతర్జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు ఆహ్వానం



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి అంద జేస్తున్న రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్లోబ్ హీల్ 2025 అంతర్జాతీయ సదస్సుకు పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నట్టు సదస్సు ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ నిమాళి తక్షశిల తెలిపారు. ఈ సదస్సులో ఏయూ కూడా భాగస్వామ్యం వహిస్తుందని దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావు శుక్రవారం సంతకాలు చేసినట్టు పేర్కొన్నారు.శ్రీలంకకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏడు దేశాలకు చెందిన, 13 విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఫిబ్రవరి 20, 21 తేదీల్లో బ్యాంకాక్‌లోని అంబాసిడర్ హోటల్లో ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తారని చెప్పారు. సదస్సులో పరిశోధకులు, హెల్త్ కేర్ నిపుణులు తమ పరిశోధన పత్రాల ను సమర్పించవచ్చని, నవంబరు 26లోగా వీటిని తమకు పంపాలని ఆమె కోరారు.

వీఎంఆర్డీఏలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



పటేల్‌కు నివాళి అర్పిస్తున్న వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేశ్, సిబ్బంది

సిరిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో నిర్వహించారు. వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ఏకీకరణ చేసే దిశగా చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్ :** మెలోడి, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, సంగం, కిన్నెర, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 44, టమాటా 36, వంకాయలు (తెలుపు) 48, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 30, పచ్చిమిర్చి 42 కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60 దొండకాయలు 32, బంగాళ దుంపలు 32, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది) 60, బరబటి 44, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 46, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 34, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 30, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226



ముస్తాబైన కొత్తవెంకోజీపాలెం శివాలయం



దీపారధనకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నంది విగ్రహం



మాలధారుల కోసం అయ్యప్పస్వామి ఆలయం

శివపూజకు సిద్ధమైన ఆలయాలు

» కార్తీక మాస ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు » నెలంతా శివాలయాల వద్ద ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాల సందడి

వెంకోజీపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పూజలకు శివాలయాలు సిద్ధమవుతున్నాయి.ఆలయాల నిర్వాహకులు ఇప్పటికే ఆలయాలకు రంగులు వేశారు. విద్యుద్దీపాలంకరణ చేపడుతున్నారు. దీంతో శివాలయాలు కొత్త శోభ సంతరించుకుంటున్నాయి. కార్తీకమాసం నేపథ్యంలో ఆలయాలకు పెద్దఎత్తున తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా నిర్వాహకులు విశేష ఏర్పాట్లు చేపడుతున్నారు.

కొత్త వెంకోజిపాలెంలో..

కొత్త వెంకోజిపాలెంలోని శ్రీరామానంద ఆశ్రమం దేవదాయ ధర్మాదాయ శాఖ శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 2వరకు కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్టు ఆలయంకార్యనిర్వాహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. 2వ తేదీన ఉదయం 10 గంటలకు మంగళధ్వనితో ప్రారంభమై అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, పంచ పల్లవ సహిత పంచామృత నారికేళ అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు ఆకాశ జ్యోతి ప్రజ్వలన ధ్వజస్థంభ శిఖరాగ్ర భాగంలో ప్రారంభం జరుగుతుందని చెప్పారు. నెల రోజుల పాటు ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఎ.రామకృష్ణ, పి.సుబ్రహ్మణేశ్వర శాస్త్రి, పి.బాలభాస్కరశర్మ, వి.లక్ష్మీనారాయణశర్మ, సంతోషశర్మల అర్చక బృందం భక్తులకు ఆలయ సముదాయంలోని శివాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయక, రాజరాజేశ్వరి, ఆంజనేయస్వామి, నూతనంగా నిర్మితమైన అయ్యప్ప దేవాలయం తదితర వాటిలో విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. నవంబరు 4న మొదటి సోమవారం స్వామివారికి



కార్తీక దీపాలను వదిలేందుకు సిద్ధం చేస్తున్న కొలను

ప్రాతఃకాలం నుంచి అభిషేకార్చనలు జరుగుతాయన్నారు. దీంతో పాటు ఆ రోజు 11 గంటలకు రుద్రాభిషేకాలు కూడా నిర్వహిస్తారన్నారు. నవంబరు 5న నాగులచవితి ఉత్సవాలు ఆలయ వద్ద నున్న పుట్టలో పూజలు, నవంబరు 6న నాగపంచమి పూజలను సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న నాగేంద్రుడి వద్ద జరపనున్నట్టు అర్చకులు చెబుతున్నారు. నవంబరు 12న కార్తీక శుద్ధ ఏకాదశి శివకేశవులను ప్రీతికరమైన రోజున స్వామివారికి ప్రాతఃకాలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, బిల్వర్చనలు సామూహికంగా జరగనున్నట్టు పేర్కొన్నారు. 13న కార్తీక శుద్ధ ద్వాదశి (చిల్కుల ద్వాదశి) క్షీరాబ్ధి ద్వాదశి ప్రశస్తమైన రోజున లక్ష్మీనారాయణులకు ప్రీతికరమైన రోజుగా భావించి తులసికోట వద్ద ఆవు నెయ్యితో దీపారాధనలు, 15న కార్తీక పౌర్ణమి పూజలు, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలాతోరణం, శీఘ్ర వివాహానికి సకల కార్యసిద్ధి, అఖండ విద్యా ఉద్యోగాభివృద్ధికి కన్యలతో కల్యాణ గౌరీవ్రతాలు, మాస శివరాత్రి పూజలు, ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన, డిసెంబరు 2న పోలి పాడ్యమిని పురస్కరించుకుని భక్తులు దీపాలను వదలడం, బ్రాహ్మణులకు భత్యం ఇవ్వడం, ఆలయానికి ఈశన్య దిగ్భాగంలో ఉండే కొలనులో తెప్పోత్సవ కార్యక్రమాలతో కార్తీక మాసం ముగింపు జరుగుతుందన్నారు.

ప్రతి రోజు ఆలయానికి రావడం వీలుకాని భక్తులకు ప్రత్యేక టిక్కెటు సదుపాయం కల్పించామని చెప్పారు. ఈ కార్తీక మాస పూజలకు స్థానిక గ్రామ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు తమ సహాయ సహకారాలు అందించనున్నట్టు తెలియజేశారు. అలాగే హెచ్‌బీకాలనీ, కేఆర్ఎం కాలనీ, ఇసుకతోట శివాలయాల్లోనూ, ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.

కార్తీక మాస పూజలు అత్యంత ఫలితం



కార్తీక మాసంలో పూజలు నిర్వహిస్తే అత్యంత ఫలితాన్ని పొందుతారు. కార్తీక మాస పూజలకు ప్రత్యేకత ఉంది. పురాణేతిహాసాల్లో ఈ విషయం చెప్పబడింది. భక్తులు ప్రాతఃకాలం నుంచే నెల రోజుల పాటు పూజలు చేసుకుంటే మంచిది.

– ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు.

19వ వార్డులో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

పెదవాల్తేరు, నవంబరు 1 :తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్న ఆధ్వర్యంలో శుక్రవారం పెదజాలారిపేట, బాపూజీనగర్ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు పిలుపు మేరకు పార్టీ అభిమానులంతా సభ్యత్వాలను భారీ స్థాయిలో చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తెడ్డు రాజు, బైరెడ్డి పోతన్న రెడ్డి, బాపూజీనగర్ ప్రెసిడెంట్ పోలారావు, సెక్రటరీ శ్రీనివాస్ సీనియర్ నాయకులు ముక్కల గోవింద్, రామోలు వీర్రాజు, రవి, శంకర్ అశోక్, సత్యసాయి, పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డులో..

ఆరిలోవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డులో టీడీపీ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్ ఆధ్వర్యంలో



పెదవాల్తేరు : సభ్యత్వ నమోదులో ఎమ్మెల్సీ చిరంజీవి

తెలుగుదేశం సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సింహగిరి కాలనీ. సంజయ్ గాంధీ కాలనీ, మనుమంతవాక జంక్షను, విశాలాక్షినగర్, ఎస్ఎస్టీ కాలనీ, జోడుగుళ్లపాలెం, పోలీసు క్వార్టర్స్‌లో సభ్యత్వాలను నమోదు చేశారు.

వాకర్స్ ఉద్యమ స్ఫూర్తిప్రదాత అళ్వార్‌దాస్

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాకర్స్ ఉద్యమ స్ఫూర్తిప్రదాత సుంకరి అళ్వార్ దాస్ అని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వపు అధ్యక్షుడు డాక్టర్ ఎస్పీ రవీంద్ర అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఎం క్యాంపస్ ఆడిటోరియంలో గురువారం అళ్వార్ దాస్ 94వ జయంతి వేడుకలను నిర్వహించారు. 'నడవండి, నడిపించండి' నినాదంతో అళ్వార్ దాస్ స్థాపించిన వాకర్స్ ఇంటర్నేషనల్ నేడు దేశ విదేశాలలో 1650 శాఖలుగా విస్తరించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్ రాజా మైదానంలో వాకర్స్ సభ్యులకు నడక పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. అళ్వార్ దాస్ విద్యా సంస్థల అధినేతలు సుంకరి రాజేంద్ర, డాక్టర్



నడక పోటీల్లో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

విజయా రవీంద్ర, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వపు అధ్యక్షుడు ప్రసాద్, వెంకటరావు, డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ రంగారావు, ఎలక్ట్ గవర్నర్‌లు కె.ద్వారకానాథ్, పూర్వపు గవరన్నర్ అప్పారావు, నందూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు గోవర్ధన పూజ

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో గోపూజ, గోవర్ధన పూజ నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి యదురాజా దాస తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి గోపూజ, గోవర్ధన పూజ, దామోదర హారతి, శ్రీకృష్ణునికి నెయ్యి దీపాల అర్పన, ప్రసాదస్వీకరణ వంటివి రాత్రి 9 గంటల వరకూ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అందరూ ఆహ్వానితులేనన్నారు.

నేటి నుంచి శివాలయాల్లో కార్తీక పూజలు



పూజలకు సిద్ధమైన కాశీఅన్నపూర్ణ సహిత విశ్వేశ్వర ఆలయం

ఆరిలోవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పురస్కరించుకొని ఆరిలోవలో అన్ని శివాలయాలను నిర్వాహకులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. శుకవారం సాయంత్రం జ్యోతిని వెలిగించి పూజలు ప్రారంభించారు. పెదగదిలిలో వెలిసిన కాశీఅన్నపూర్ణ సహిత విశ్వేశ్వర ఆలయం ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుంగా తగిన వసతులను ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య శివయ్యకు వివిధ జీవనదులు నీరు,పంచామృతాలు, విభూతితో 109 కల శాలతో అభిషేకాలు నిర్వహించారు.

పంచారామాల దర్శనానికి ఆర్టీసీ స్పెషల్ ప్యాకేజీ

ద్వారకా బస్‌స్టేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో పంచారామాలు దర్శించుకోవాలనుకనే భక్తుల కోసం ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించినట్టు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం ప్రకటించింది. ప్రతి ఆదివారం సాయంత్రం 5.00 గంటలకు బస్సు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. సోమవారం ఉదయానికి అమరావతి చేరుకుంటుంది. అమరావతిలో స్వామివారి దర్శనం అనంతరం భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలకు తీసుకువెళతారు. దర్శనం అనంతరం అదేరోజు రాత్రి ద్వారకా బస్ స్టేషన్‌కు చేరుకుంటుంది. ఇందుకు టిక్కెట్ ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ సర్వీస్‌కు రూ.2,150, ఆల్ట్రా డీలక్స్ బస్సుకు రూ.2,100గా నిర్ణయించారు. టికెట్లు కావలసిన వారు 9959225602, 9052227083 నంబర్లలో సంప్రతించాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ ఇన్‌చార్జి రీజనల్ మేనేజ్ బి.అప్పలనాయుడు కోరారు.

92.41 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు నెల మొదటి రోజునే 92.41 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. 1,49,668 మంది లబ్ధిదారులకు రూ.64,23,58,500లు పంపిణీ చేశారు. అత్యధికంగా పద్మనాభంలో 94.51 శాతం, భీమునిపట్నం 94.28 శాతం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతంలో 93.79 శాతం 25,158 మందికి, అర్బన్‌లో 92.13 శాతం 1,24,510 మందికి పించన్లు అందజేశారు. వివిధ కారణాలతో 12,301 మందికి శని, ఆదివారాల్లో అందజేయనున్నారు.

పరీక్ష ఫీజు తగ్గించడంపై విద్యార్థుల హర్షం

వెంకోజీపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో విద్యార్థులకు సెమిస్టర్ పరీక్ష ఫీజును తగ్గించడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావును కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులకు ఉపయుక్తంగా ఫీజును తగ్గించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాం లో పెంచిన ఈ ఫీజులను విద్యార్థులు విజ్ఞాపనను స్వీకరించి, సత్వరం స్పందించి ఫీజుల ను తగ్గించడంపై విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. వర్సిటీలో విద్యార్థులకు అనువైన వాతావరణాన్ని, అనుకూలమైన పరిస్థితులను కల్పించడంపై అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



వీసీ శశిభూషణరావుకు కృతజ్ఞతలు చెబుతున్న విద్యార్థులు

ఈ స్కూటర్ ఎవరిదో..?



ఆరిలోవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సుమారు 20 రోజుల నుంచి ఒక ద్విచక్రవాహనం పెదగదిల జంక్షన్ అంబేద్కరు విగ్రహం వద్ద ఉన్నది. ఈ వాహనం ఎవరిదో తెలియదు. ఎందుకు ఇక్కడ పార్కింగ్ చేసి ఉన్నదో కూడా తెలియదు. ఎవరైన దొంగతనం చేసి ఈ వాహనం ఇక్కడ పార్కింగ్ చేసి ఉన్నారో తెలియదు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరారు.

కాలువ పనులు పరిశీలన

ఆరిలోవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల జై భీం నగర్‌లో శిథిలావస్థకు చేరిన కాలువకు మరమ్మతులు చేపడుతున్నట్టు కార్పొరేటర్ కెల్ల సునీత తెలిపారు. ఈ కాలువ పూర్తిగా పాడవడంతో మురుగు నీరు సక్రమంగా ప్రవహించడం లేదని, దీంతో దోమల వ్యాప్తి చెందడం, తీవ్ర దుర్వాసన వెలువడేదని ఆమె తెలిపారు. ఈ సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసినట్టు చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ఏఐటీయూసీ ముందుకు సాగుతోందని రాష్ట్ర సమితి సభ్యుడు బూసి వెంకటరావు అన్నారు. యూనియన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్టీల్‌ప్లాంట్‌లో గురు వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ కార్మిక సమస్యలపై అలుపెరుగని పోరాటం సాగిస్తున్నదని అన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గం అభ్యున్నతి, వారి సమస్యలు పరిష్కరించేందుకు ఎన్నో పోరాటాలు యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టామన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల బదిలీ

» ఉత్తర్వులు జారీ చేసిన జీవీఎంసీ కమిషనర్

వెంకోజీపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలోని పట్టణ ప్రణాళిక అధికారుల అంతర్గత బదిలీలను చేపడుతూ కమిషనర్ పి.సంపత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటి వరకుజోన్-1 నుంచి జోన్ 4 వరకు సిటీ ప్లానర్-1గా, జోన్1 నుంచి జోన్ 2 వరకు డీసీపీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న కె.ధనంజయరెడ్డి ని జోన్ 1 నుంచి 4 వరకు సిటీ ప్లానర్-1 గా నియమించారు. జోన్ 5 నుంచి జోన్ 8 వరకు సిటీ ప్లానర్-2గా, జోన్ 3, జోన్ 4 డీసీపీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న సీపీ-2 విత్తనాల మీనాకుమారిని జోన్ 5 నుంచి జోన్ 8 వరకు సిటీ ప్లానర్-2 గా బదిలీ చేశారు. జోన్ 5, 7, 8తో పాటు ప్రకటన వింగ్ డీసీపీగా పనిచేస్తున్న టీజీ రామ్మోహన్‌ను జోన్ 5 నుంచి 8 డీసీపీ-2గా మార్చారు. జోన్ 6 ఏసీపీగా పనిచేస్తున్న కె.హరిదాస్‌ను జోన్ 1 నుంచి 4 వరకు డీసీపీ-1 ఇన్‌చార్జిగా, జోన్-7 ఏసీపీ, టీపీవో ఇన్‌చార్జి, టీపీబీఓ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఏసీపీ యు.రామకృష్ణను జోన్-1 ఏసీపీగా బదిలీచేశారు. జోన్-1 ఏసీపీగా, టీపీవో ఇన్‌చార్జిగా, టీపీబీవో ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఏసీపీ ఎం.తిరుపతిరావును జోన్-2 ఏసీపీ గా, జోన్3 ఏసీపీగా పనిచేస్తున్న సీహెచ్ మధుసూధనరావును జోన్-3 రిటైన్డ్ ఏసీపీగా, జోన్-4 ఏసీపీ కె.ఝాన్సీలక్ష్మిని జోన్-4 రిటైన్డ్ ఏసీపీగా, జోన్-2 ఏసీపీ, టీపీవో, టీపీబీఓ ఇన్‌చార్జిగా చేస్తున్న ఏసీపీ ఎస్.సత్యనబ్బన్‌ను జోన్-5 ఏసీపీ, ప్రకటనల ఇన్‌చార్జిగా నియమించారు. జోన్-5 ఏసీపీ కె.వెంకటరావును జోన్-6 ఏసీపీ, జోన్-7 ఇన్‌చార్జి ఏసీపీ, జోన్-6 ఇన్‌చార్జి డీసీపీ, ప్రకటనల ఏసీపీగా చేస్తున్న వి.రామలింగేశ్వరరెడ్డిని జోన్-8 ఏసీపీగా, జోన్-4 టీపీవో కె.పద్మను జోన్-8 టీపీవోగా, జోన్-6 టీపీవో, ఇన్‌చార్జి టీడీబీవో గా చేస్తున్న టీపీవో ఓ.వరప్రసాద్‌ను జోన్ 6 టీపీవో, ఇన్‌చార్జి టీపీఎస్, రిటైన్డ్ జోన్ 6 గానూ, జోన్ 8 టీపీవో, ఇన్‌చార్జి ఏసీపీ, ఇన్‌చార్జి టీపీఎస్ జి.బాలరాజును జోన్2 టీపీవో, ఇన్‌చార్జిగా టీపీఎస్‌గా, ఎన్‌ఫోర్స్‌మెంట్‌వింగ్ ఇన్‌చార్జి, ఎస్టేట్ అధికారి టీపీవో సి.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను జోన్ 5 టీపీవో, ఇన్‌చార్జి టీపీఎస్‌గా బదిలీచేశారు. టీపీవో వి.కొండలరావును జోన్-4 టీపీవోగా, ఇన్‌చార్జి టీపీఎస్‌గా, టీపీవో పి.కనకరావును జోన్-7 టీపీవో, ఇన్‌చార్జిగా టీపీఎస్‌గా, టీపీవో వి.వాణిని జోన్-3 టీపీవోగా, జోన్-3 టీపీఎస్, ఇన్‌చార్జి టీపీవో టీపీఎస్ ఎస్.గోపన్నను జోన్-8 టీపీఎస్‌గా, జోన్ 4 టీపీఎస్ సిహెచ్.వి.నారాయణరావును జోన్-3 టీపీఎస్, జోన్ 4 టీపీఎస్, ఇన్‌చార్జి టీపీవో టీపీఎస్ జి.విజయకుమార్‌ను జోన్-1 టీపీఎస్‌గా, ఇన్‌చార్జి టీపీవోగా మార్పు చేశారు. సిటీప్లానర్-1కు అర్బన్ రీసర్వే, ఎస్టేట్ వింగ్, స్లమ్స్, టీడీఆర్ సమస్యలు, కౌన్సిల్ మీటింగ్, మాస్టర్ ప్లాన్, మాస్టర్‌ప్లాన్ రోడ్లుకోర్టు కేసుల మోనిటరింగ్, ఏపీడీపీఎంఎస్, ఎల్‌టీపీ మార్పు/బిల్డర్ రిజిస్ట్రేషన్, ఆఫీసు ఎస్టాబ్లిష్‌మెంట్, యూసీఎస్, పేపర్ క్లిపింగ్స్ (అచీవ్‌మెంట్ అండ్ అడ్వర్స్ న్యూస్), రీజాయిండర్స్ డయల్ యువర్ మేయర్, సీటీసీ, ప్రజావాణి, కమిషనర్ రివ్యూలు, వీవీపీ సిఫార్సులు, పార్కింగ్ సమస్యలు, ఎల్ఆర్ఎస్, ఫైర్ వింగ్, టూరిజంలను అప్పగించారు. సిటీ ప్లానర్-2కు సీఅండ్‌డీ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఆర్‌టీఐ, హౌసింగ్, పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్, డబ్ల్యూపీఆర్ఎస్ ఎస్టాబ్లిష్‌మెంట్ వర్క్‌లు, డ్రాయింగ్/జీఐఎస్‌వింగ్, ప్రకటనలు, ఈవెంట్ అనుమతులు, డీపీసీ మీటింగ్‌లు, సమస్యలు, రోడ్డు సేఫ్టీ అండ్ ట్రాఫిక్ కమిటీ సమావేశాలు, సమస్యలు, బడ్జ్ సమస్యలు, ఆడిట్ పారాస్, ఏపీపీసీబీ అండ్ సీఆర్‌జెడ్, స్ట్రీట్ వెండర్స్ పాలసీ, ఎలక్షన్స్, విపత్తుల మేనేజ్మెంట్‌ను అప్పగించారు.

తైక్వాండో క్రీడాకారిణికి ఎమ్మెల్యే అభినందన



మౌనిక అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ/ ఆరిలోవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12 నుంచి 15 వరకూ అమృత్‌సర్‌లో నిర్వహించనున్న ఆల్ ఇండియా ఉమెన్ తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి కె. మౌనికను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అభినందించారు. ఆరిలోవ కాలనీలోని బాబా తైక్వాండో అకాడెమీలో శిక్షణ పొందిన మౌనిక సాంకేతిక విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏయూ ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్స్ తైక్వాండో ఇండివిజువల్ పూమ్ సే లో అర్హత సాధించి, జాతీయ స్థాయిలో ఎంపిక అయినట్టు హెడ్ కోచ్ షేక్ అలీ తెలిపారు. టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షులు గాడి సత్యం, టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జ్ రాగతి అచ్యుతరావు, నాయకులు ఒమ్మి పోలారావు, ఒమ్మి రాజు, కోచ్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ట్రస్టీగా జస్టిస్ సోమయాజులు



జస్టిస్ సోమయాజులతో బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు

రామ్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ట్రస్టీగా జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు నియమితులయ్యారు.శుక్రవారం రామ్‌నగర్ ఏఎస్ రాజా వాలంటరీ బ్లడ్ బ్యాంక్ విభాగంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమ యాజులు విచ్చేశారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ట్రస్టీగా ఉండేం దుకు ఆయన సమ్మతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బ్లడ్ బ్యాంక్ దార్శనికత లక్ష్యాలను నెరవేర్చటానికి, స్వచ్ఛంద రక్తదాత లను ప్రోత్సాహించటం వంటి విషయాల్లో తన వంతు కృషి చేస్తానన్నారు. తన వంతు పూర్తి సహాయ సహకారా లను అందిస్తా నని తెలిపారు. చైర్మన్ డాక్టర్ ఏవీ శివప్రసాద్ ఇతర ట్రస్టీలు హాజరయ్యారు.

గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న కాలభైరవ స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి మకర తోరణం అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాస్కర్‌శర్మల ఆధ్వర్యంలో భక్తుల పేరిట అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, కాళ్ల వరహాలు, మద్దాల వీర వెంకట అప్పారావు, బోర ఎర్రాజిరెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, భక్తులు, అయ్యప్ప మాలదారులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు మెరుపులు



విద్యుత్ వెలుగుల్లో కలెక్టర్ కార్యాలయం

మహారాణిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం జిల్లా అధికారులతో సీఎం సమీక్షిస్తారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా పోలీసు అధికారులు కలెక్టరేట్‌ను తమ ఆధీనంలోకి తీసుకొని భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. కలెక్టర్ కార్యాలయం బయట వ్యర్థాలను తొలగించి, పరిశుభ్రత-పచ్చదనం పనులు చేపట్టారు. కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విజయవాడ వరద బాధితులకు రూ.10 లక్షల ఆర్థికసాయం

మహారాణిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశాన శంకరరావు నాయకత్వంలో నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కులాల జనగణన, రిజర్వేషన్లు, వసతిగృహాలు, నూతన భవన నిర్మాణం, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, కుమ్మరి క్రాంతికుమార్, కాజుల శ్రీనివాస గౌడ్, వైవీరావు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ బాలోత్సవం ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ చాంబర్‌లో విశాఖ బాలోత్సవ పోస్టర్‌ను కమిషనర్ సంపత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ నెల 9లోగా ఎంట్రీలను బాలోత్సవ కేంద్రానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పి.రఘు, సభ్యులు పాల్గొన్నారు.

పంచారామాల దర్శనానికి ఆర్టీసీ స్పెషల్ ప్యాకేజీ

ద్వారకా బస్‌స్టేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పంచారామాలు దర్శించుకోవాలనుకునే భక్తుల కోసం ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించినట్లు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం ప్రకటించింది. ప్రతి ఆదివారం సాయంత్రం 5 గంటలకు బస్సు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి సోమవారం ఉదయానికి అమరావతి చేరుకుంటుంది. అక్కడ స్వామివారి దర్శనం అనంతరం భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలకు తీసుకువెళతారు. అదేరోజు రాత్రి ద్వారకా బస్ స్టేషన్‌కు చేరుకుంటుంది. టిక్కెట్ ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ సర్వీస్‌కు రూ.2,150, అల్ట్రా డీలక్స్ బస్సుకు రూ.2,100గా నిర్ణయించారు. టికెట్లు కావలసిన వారు 9959225602, 9052227083 నంబర్లలో సంప్రతించాలని ఆర్టీసీ విశాఖ ఇన్‌చార్జి రీజనల్ మేనేజ్ బి.అప్పలనాయుడు కోరారు.

'మద్యం దుకాణం ఏర్పాటు కానివ్వం'

జ్ఞానాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 34వ వార్డు భూపేష్‌నగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ కొద్ది రోజులుగా స్థానికులు చేస్తున్న పోరాటంపై దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు స్పందించారు. ఆయన నేరుగా వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రజాభిప్రాయం మేరకు ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లో మద్యం దుకాణం ఏర్పాటు చేయనివ్వబోమని చెప్పారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో మాట్లాడి హామీ కూడా తీసుకున్నారు. ఇదే విషయాన్ని స్థానికులకు తెలియజేసి వారి పోరాటాన్ని విరమింపజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ భూపేష్‌నగర్‌లో సుమారు 500 కుటుంబాలు ఉంటున్నాయన్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలపై స్థానికులు మండిపడ్డారని చెప్పారు. మహిళా, ప్రజా సంఘాల సహకారంతో కొద్ది రోజులుగా ఇక్కడ వారు మద్యం దుకాణం ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆదిబాబు, నాగేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

శీతాకాలపు వ్యాధులకు ఆయుర్వేద వైద్య చికిత్స

మహారాణిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో జీర్ణ, శ్వాస కోశ వ్యాధులకు ఆయుర్వేద చికిత్స విధానం శరీరానికి మేలు చేస్తుందని ప్రముఖ ఆయుర్వేద చికిత్స నిపుణులు డాక్టర్ గౌతమ్ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ జంక్షన్ సమీపంలోని సమావేశమందిరంలో అవగాహన కల్పించారు. దీపావళి పండుగ తరువాత వాతావరణ పరిస్థితుల కారణంగా శరీరంలో అనేక మార్పులు సంభవిస్తాయన్నారు. ప్రధానంగా జీర్ణకోశ, శ్వాసకోశ వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. సాంప్రదాయ సురక్షితమైన ఆయుర్వేద చికిత్స విధానంతో అనారోగ్యకారకాలైన శరీరంలోని అదనపు లవణాలను తొలగించి మెరుగైన ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు.

కార్తీక పూజలకు శైవాలయాలు ముస్తాబు



సీతమ్మధారలో విద్యుత్‌కాంతులతో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం



ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న దృశ్యం



దసపల్లా హోటల్ వద్ద విశ్వేశ్వర ఆలయం

సీతమ్మధార, డాబాగార్డెన్స్, జగదాంబ కూడలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం అమావాస్య ఘడియలు వీడటం, పాడ్యమి మొదలు కావడంతో శివాలయాల్లో ఆకాశ దీపాలు వెలిగించి కార్తీక మాసానికి శ్రీకారం చుట్టారు. ధ్వజస్తంభాల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశ దీపాలు వెలిగించారు. హర హర మహాదేవ శంభో శంకర, ఓం నమశ్శివాయ అంటూ భక్తులు చేసిన శివ నామస్మరణ మధ్య ఆకాశ దీపాలను వెలిగించి స్తంభాలకు వేలాడదీసి కార్తీక మాసోత్సవాలకు శ్రీకారం చుట్టారు. 'ఓం నమఃశివాయ' అన్న శివపంచాక్షరి మంత్రంతో శైవక్షేత్రాలు శనివారం నుంచి మారుమోగనున్నాయి. శివకేశవులను భక్తిశ్రద్ధలతో పూజించే కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లోని శైవాలయాల్లో అభిషేక పూజలకు ఏర్పాట్లు చేశారు. సముద్ర తీరంలో పవిత్ర స్నానాలు, ఆలయాల్లో దీపారాధనలు, అభిషేకాలు, ఉపవాస దీక్షలకు భక్తకోటి సన్నద్ధమవుతోంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద అతిపురాతన శ్రీభీమేశ్వర, రాజరాజేశ్వరి, జగదాంబ జంక్షన్ వద్ద శ్రీవిశ్వేశ్వర ఆలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. నెలరోజులు సాంస్కృతిక కార్యక్రమాలు, రుద్రాభిషేకాలు, కార్తీక పురాణ పఠనం వంటివి, సాయంత్రం వేళల్లో ఆకాశ దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు దేవాదాయశాఖ ఉపకమిషనర్ ఎన్.సుజాత వెల్లడించారు. అన్ని శివాలయాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామన్నారు. విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన ఆకాశదీప వేడుకల్లో ఆలయ మేనేజర్ ఆడపా దేవుళ్లు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు బాదంపూడి సదాశివ ఆకాశదీపాన్ని వెలిగించారు. పాండురంగ స్వామి ఆలయంతో పాటు వివిధ శివాలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతమ్మధారలో ఉమానీలకంఠేశ్వరాలయం, సీతంపేట పార్వతీశ్వరాలయాలు విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. నక్కవానిపాలెం, గాంధీనగర్, సీతమ్మధార, క్రాంతినగర్, చైతన్యనగర్, మద్దిలపాలెం, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, కెఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజలు నిర్వహిస్తారు. తెల్లవారు జాము నుంచి భక్తుల రాక ఆరంభమవుతుంది.

అందరి జీవితాల్లో వెలుగులు రావాలి: ఎమ్మెల్యే వంశీకృష్ణ



కుటుంబ సభ్యులతో దీపావళి టపాసులు కాలుస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి జీవితంలో దీపావళి వెలుగులు రావాలని అప్పుడే ప్రజలందరూ సంతోషంగా జీవించగలుగుతారని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అభిలషించారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. టపాసులు పేల్చారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుని కోరుకున్నానన్నారు.

ఎమ్మెల్యేకు 39వ వార్డు ప్రజల అభ్యర్థన

జగదాంబ కూడలి: వన్‌టౌన్ కురుపాం మార్కెట్‌ను ఆధునికీకరించి కల్యాణ మండపం నిర్మించాలని గ్రేటర్ 39వ వార్డు ప్రజలు ఎమ్మెల్యే వంశీకృష్ణకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గ్రేటర్ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పాత పోస్టాఫీసు వద్ద అగ్నిమాపక కేంద్రానికి కొత్త భవనం నిర్మించాలని కోరారు. సబ్‌రిజిస్ట్రార్, స్టేట్ బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల సముదాయ భవనాన్ని ఆధునికీకరించాలని కార్పొరేటర్ సాధిక్ కోరారు. చిలకపేట సులభ్‌కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న భవనం, లక్ష్మీ టాకీస్ వద్ద పార్క్, రైతుబజారును వినియోగంలోకి తేవాలని స్థానికులు అభ్యర్థించారు. ఫెర్రి రోడ్డు వద్ద నమాజ్ స్థలం బాగుచేయాలని ముస్లింలు వేడుకున్నారు. మంచినీటి సదుపాయం, ఎస్ఎల్ కాలువ విస్తరణ, డంపింగ్ యార్డ్ తరలింపు అవసరాన్ని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో పారిశుధ్యం మెరుగుపరచడం లేదని ఆరోపించారు. పాతనగరం ప్రాంతాన్ని పోర్టు కాలుష్యం బారినుంచి రక్షించాలని స్థానికులు కోరారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడును ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశించారు. పారిశుధ్యం మెరుగుపడేలా శ్రద్ధచూపాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు.

హామీలన్నీ అమలు చేస్తాం: ఎమ్మెల్యే గణబాబు



ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మర్రిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నిటిని నెరవేర్చుతామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. శుక్రవారం మర్రిపాలెం రామునాయుడు కాలనీలో సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇస్తామని గణబాబు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట తప్పని నాయకుడని, సూపర్ సిక్స్ పథకాలపై ఎవ్వరూ అపోహపడనవసరం లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ఆయన పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-5 జోనల్ కమిషనర్ రాము, పౌరసరఫరాల ఆర్ఐ మణికంఠ, కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెంటకోట అజేయ్‌బాబు, అంగ ప్రశాంతి, కిల్లి శ్రీరామమూర్తి, రాపేటి నారాయణరావు, పిల్లి దుర్గారావు, శరగడం భాను, మడక గౌరి పాల్గొన్నారు.

మురళీనగర్ పోస్టాఫీసు పునరుద్ధరణకు వినతి



విజ్ఞాపన పత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి); విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 50వ వార్డులో పోస్టాఫీసు ఏర్పాటు చేయాలని కోరుతు శుక్రవారం మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సనపల వరప్రసాద్, వైశాఖీ స్పోర్ట్సు పార్కు కమిటీ సెక్రెటరీ పి.వి.ఎస్.ఎన్.రాజు విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును కలిసి వినతిపత్రం అందించారు. దాదాపు 15 ఏళ్లుగా ఇక్కడ కొనసాగిన పోస్టాఫీసు ఇటీవల అర్థంతరంగా మూసి వేయడంతో ఈ ప్రాంత వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 4 వేల వరకు పోస్టాఫీసు ఖాతాలు, డిపాజిట్లు ఉన్న విషయాన్ని ఆయనకు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు చేరువలో పోస్టాఫీసు తిరిగి ఆరంభించేలా చూడాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వివాదాస్పదంగా స్టెల్లా మేరిస్ విద్యార్థినుల ర్యాలీ

- సేవ్ దీపావళి పేరుతో ర్యాలీ ఎలా నిర్వహిస్తారని నిర్వాహకులను నిలదీసిన నగర పౌరుడు
- పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

ఎన్ఏడీ జంక్షన్ (విశాఖపట్నం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేవ్ దీపావళి పేరుతో నగరంలో ఒక క్రిస్టియన్ పాఠశాల యాజమాన్యం ర్యాలీ నిర్వహించడం వివాదాస్పదమైంది. విద్యార్థినులతో ర్యాలీ చేపట్టడాన్ని హిందూ మతానికి చెందిన ఒకరు తప్పుబట్టారు. పండుగ వద్దని విద్యార్థినులతో ర్యాలీ ఎలా చేయిస్తారని...అతను నిలదీస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో హిందూ, క్రైస్తవ సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే...దీపావళికి ముందురోజు...అక్టోబరు 30న మర్రిపాలెం వుడా కాలనీలోని స్టెల్లా మేరిస్ స్కూల్ నిర్వాహకులు విద్యార్థినులతో కాలనీ నుంచి జాతీయ రహదారి మీదుగా రిలయన్స్ పెట్రోల్‌బంకు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్కూల్ బ్యానర్, ప్లకార్డులు పట్టుకుని సేవ్ ఎర్త్...హ్యాపీ దీపావళి అని నినాదాలు చేస్తూ దాదాపు 100 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. అదే సమయంలో అటువైపు వెళుతున్న ఓ హిందూ అభిమాని...నిర్వాహకులను ప్రశ్నించారు. తన సెల్‌ఫోన్‌తో వీడియో తీశారు. విద్యార్థి దశ నుంచే హిందూ పండుగల పట్ల విషబీజాలు నాటుతున్నారని, మీరు ఏ మతం వారని ప్రశ్నించారు. పండుగ వద్దంటూ చిన్నారులతో ర్యాలీ ఎందుకు తీయిస్తున్నారని నిలదీశారు. డిసెంబరు 25న మొక్కలను తొలగించి మీరు ప్రార్థనలు చేయడం లేదా...అప్పుడు పర్యావరణం దెబ్బతినదా, కేవలం దీపావళి పండుగ రోజున మాత్రమే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందా...అని ప్రశ్నించారు. విద్యార్థినులతో జైశ్రీరామ్ అంటూ ఆయన నినాదాలు చేయించారు. ఈ వీడియో వైరల్ కావడంతో పలు హిందూ సంఘాల నాయకులు గురువారం మర్రిపాలెం స్కూల్ ఎదురుగా బాణసంచా కాల్చడం వివాదాన్ని పెద్దది చేసింది. అదే సమయంలో నగరంలో ముఖ్యమంత్రి పర్యటన ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిపై ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నాయి. పాఠశాల యాజమాన్యం నిర్వహించిన ర్యాలీపై మండల విద్యాశాఖాధికారి సోమేశ్వరరావును వివరణ కోరగా దీనిపై ఫిర్యాదు రాలేదని, ఆ వీడియో చూడలేదన్నారు. వీడియోను పరిశీలించి, అవసరమైతే పాఠశాల యాజమాన్యానికి నోటీసులిచ్చి వివరణ కోరతామన్నారు.

తెలుగు ప్రజల హక్కు స్టీల్‌ప్లాంట్: కె.ఎస్.చలం



స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయం అంటూ సంఘీభావాన్ని ప్రకటిస్తున్న వక్తలు

డాబాగార్డెన్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల హక్కు స్టీల్‌ప్లాంట్ అని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తక్షణమే ఆపాలని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం డిమాండ్ చేశారు. శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కడప ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్ సభ నిర్వహించారు. నష్టాల్లో ఉందని ఇందులో పెట్టుబడులు పెట్టకూడదని కేంద్రం ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఎక్కువ మంది పనిచేస్తున్నందున వారి ఉపాధి కోసమైనా ప్రభుత్వరంగంలో కొనసాగించాలన్నారు. ప్రొఫెసర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణకు విద్యార్థులందరూ సమావేశం కావడం అభినందించదగ్గ విషయమన్నారు. సోషల్ మీడియాలో అందరికీ షేర్ చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ .విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో ఎందుకు విలీనం చేయలేదని ప్రశ్నించారు.సభకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు అధ్యక్షత వహించగా, పోరాట కమిటీ నాయకులు జి.అయోధ్యరామ్, ఏ.అశోక్, రామన్న, జాన్సన్‌బాబు, భాను, హరీష్‌కుమార్, ప్రసన్నకుమార్, రాము, రాజు, సంతోష్, పల్లవి, సౌమ్య, రామ్మోహన్, నాగరాజు, అభిలాష్, విశ్వనాథం పాల్గొన్నారు.

ఫ్లైఓవర్లా?, ఎలివేటెడ్ కారిడారా??

... 3వ పేజీ తరువాయి

పరిష్కారానికి జాతీయ రహదారిపై 12 ఫ్లైఓవర్లు నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. కేంద్రానికి పంపితే నిధులు కూడా మంజూరయ్యాయి. టెండర్ల దశలో ఆగిపోయాయి.

ఎలివేటెడ్ కారిడార్ పేరుతో జాప్యం

విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టు కోసం పదేళ్ల నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గాజువాక నుంచి కొమ్మాది వరకు నడపాలనేది ఆలోచన. ఈ ప్రాంతాల మధ్య మెట్రో రైలును ఉపయోగించుకునే వారి సంఖ్య చాలా స్వల్పం. వాస్తవంగా చెప్పాలంటే ఆదాయం పెద్దగా రాదు. ఈ ప్రాజెక్టుకు కేంద్రంతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం సగం మొత్తం భరించాల్సి ఉంది. దీని వ్యయం రూ.14 వేల కోట్ల పైమాటే. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో దీనిని గుదిబండగానే గుర్తించాల్సి ఉంది. ఈ మెట్రో ప్రాజెక్టు డీపీఆర్‌కు కేంద్రం నుంచి ఇంకా ఆమోదం లభించలేదు. గత ప్రభుత్వం గద్దె దిగే ముందు ఫైల్ ఢిల్లీకి పంపింది. దానిని మళ్లీ ఇప్పుడు మార్చాలని కూటమి నేతలు భావిస్తున్నారు. ఫ్లైఓవర్లకు, మెట్రో రైలు ప్రాజెక్టుకు కనెక్టివిటీ ఉండేలా ఎలివేటెడ్ కారిడార్ వేస్తామని చెబుతున్నారు. వీటి అధ్యయనానికి, డీపీఆర్‌లకు చాలా సమయం పడుతుంది. ఈలోగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే విమాన ప్రయాణికులకు ఇబ్బందులు మొదలవుతాయి. నగరంలో ఏవైతే ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లుగా గుర్తించారో వాటిపై ఇంకా అదనపు ఒత్తిడి పెరుగుతుంది. ఈ సమస్యకు సరైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంది.

ఖాళీగా ఐటీ టవర్లు

విశాఖపట్నంలో అనేక ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నాయి. రుషికొండ ఐటీ పార్కులో 2019లో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు మిలీనియం టవర్-1 ప్రారంభించారు. అందులో నాలుగు అంతస్థులు ఐదేళ్లుగా ఖాళీగానే ఉన్నాయి. పక్కనే మరో టవర్-2 నిర్మించారు. అందులో ఎనిమిది అంతస్థులు ఖాళీగా ఉన్నాయి. సుమారు 3.5 లక్షల చ.అ. విస్తీర్ణం ఖాళీగా ఉంది. కాపులుప్పాడలో నాటి ఐటీ మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధతో 175 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఐటీ లేఅవుట్‌లో స్థలాలను అప్పటి నుంచి ఎవరికీ కేటాయించలేదు. విశాఖలో గత టీడీపీ హయాంలోనే అదానీ డేటా సెంటర్‌కు భూములు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి, మళ్లీ భూములు ఇచ్చింది. శంకుస్థాపన జరిగి రెండేళ్లయింది. డేటా సెంటర్ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన స్టార్టప్ విలేజ్ వెలవెలబోతోంది. రుషికొండపై రూ.500 కోట్లతో జగన్ నిర్మించిన ప్యాలెస్ కూడా ఖాళీగానే ఉంది. వందల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలు వృథాగా ఉన్నాయి. వీటిని తక్షణమే వినియోగంలోకి తెచ్చే నిర్ణయాలు తీసుకోవలసి ఉంది. ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇవ్వలేదు.

దీపం వెలుగులు

... 3వ పేజీ తరువాయి

ఒక ఇంట్లో రెండేసి కుటుంబాలు ఉన్నందున వారిని ఒక్కరిగానే పరిగణనలోకి తీసుకున్నారు. భీమిలి నియోజకవర్గంలో 88,987 మంది, విశాఖ తూర్పులో 62,640, విశాఖ పశ్చిమలో 44,461, విశాఖ దక్షిణంలో 41,971, విశాఖ ఉత్తరంలో 39,745, గాజువాకలో 71,111, పెందుర్తిలో 28,009 మంది అర్హులు ఉన్నట్టు ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించగానే సుమారుగా 45 వేల మంది సిలిండర్లు బుక్ చేసుకున్నారు. వీరికి దశల వారీగా సిలిండర్లు పంపిణీ చేస్తారు. వీటిని డెలివరీ తీసుకున్నప్పుడు లబ్ధిదారులు సిలిండర్‌కు నగదు చెల్లించాలి. అక్కడి నుంచి 48 గంటల్లో ఆ మొత్తం వారి బ్యాంక్ ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుంది.

సందడిగా దీపావళి .

... 3వ పేజీ తరువాయి

బాణసంచా వ్యాపారం జరిగి ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. వ్యాపారుల సంఖ్య పెరగడంతో ఆశించిన స్థాయిలో లాభాలు రాలేదని పేర్కొంటున్నారు. అయితే, గడిచిన ఏడాది మిగిలిపోయిన సరకును కూడా క్లియర్ చేసుకోగలిగామని ఒక స్టాల్ నిర్వాహకుడు తెలిపారు. ఏదిఏమైనా గడిచిన మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది దీపావళి అమ్మకాలు పెద్ద ఎత్తున జరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

ఎంవీపీ ఎస్.ఐ.పై సస్పెన్షన్ వేటు

... 3వ పేజీ తరువాయి

ఇంట్లో బంగారం పోయిందని, పనిమనిషిపై అనుమానం ఉందంటూ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ముందస్తు విచారణ ఏమీ లేకుండా సదరు మహిళను స్టేషన్‌కు తీసుకువచ్చి, తీవ్రంగా కొట్టారు. ఆమె కాలు విరిగిపోయింది. విషయం సీపీ వరకూ చేరడంతో ప్రాథమిక విచారణ అనంతరం ఎస్ఐను సస్పెండ్ చేశారు. సి.ఐ.పై కూడా శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా 7995095799 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని, వివరాలు గోప్యంగా ఉంచుతామని సీపీ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయికి ఉక్కు ఉద్యమం

... 3వ పేజీ తరువాయి

ముఖ్య వక్తగా విచ్చేసిన కె.రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం కార్మికులకు మాత్రమే పరిమితం కాకూడదని, దీన్ని ప్రజా పోరాటంగా మలిచి ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఢిల్లీలోనూ పోరాట కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారని గుర్తుచేస్తూ...వారిపై ఇప్పుడు ఒత్తిడి తీసుకురావలసి ఉందన్నారు. ఈ నెల 7న విజయవాడలో వామపక్షాల సమావేశం ఏర్పాటుచేశామని, ఇందులో ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకువెళ్లడంపై చర్చిస్తామని తెలిపారు. 'చలో అమరావతి' వంటి కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. ఎన్నికల ముందుకంటే ఆ తరువాతే ఉక్కు పరిశ్రమకు ప్రైవేటీకరణ ముప్పు పెరిగిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్లాంటు కుంటుపడేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటవుతుందంటున్న మిట్టల్ స్టీల్‌ప్లాంటుకు ముడి సరకుతో పాటు అవసరమైన అన్ని వనరులూ సమకూర్చడానికి సిద్ధమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో చొరవ చూపకపోవడమేమిటని రామకృష్ణ ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే చంద్రబాబు చరిత్రహీనుడిగా మిగిలిపోతారని హెచ్చరించారు. దీన్ని కాపాడకుండా ఎన్ని మంచి పనులు చేసినా ప్రజలు గుర్తించరన్న విషయాన్ని గ్రహించాలన్నారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న ఎంపీలు ఆ విషయంపై ప్రధానిని కలుసుకునేందుకు చొరవ చూపడం లేదన్నారు. సుదీర్ఘకాలంగా జరుగుతున్న పోరాటం వల్లే విశాఖ ఉక్కును ఇంతవరకు కాపాడుకుంటూ రాగలిగామని, దీన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటు ఆర్థిక మండళ్లు (ఎస్ఈజెడ్) మాదిరిగా ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు పెట్టాలంటూ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించడం సరికాదన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏవీ వర్మరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, వామపక్ష, పౌర, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన కాలుష్యం

... 3వ పేజీ తరువాయి

గురువారంతో పోలిస్తే దీపావళి రోజున గాలి నాణ్యత గణనీయంగా తగ్గినట్టు అధికారుల పరిశీలనలో తేలింది. పీఎం-10 అత్యధికంగా జ్ఞానాపురంలో 307గా నమోదు కాగా, మిందిలో 301, పోలీస్ బ్యారెక్స్ వద్ద 274, ఎంవీపీ రైతుబజార్ వద్ద 266, జీవీఎంసీ కార్యాలయం వద్ద 249 నమోదైంది. పీఎం 2.5 జీవీఎంసీ కార్యాలయం వద్ద 165గా నమోదు కాగా, పోలీస్ బ్యారెక్స్ వద్ద 131, ఎంవీపీ రైతుబజార్ వద్ద 122, మిందిలో 121గా నమోదైంది. అంతర్జాతీయ ప్రమాణాలు ప్రకారం పీఎం 10...100 మిల్లీగ్రామ్స్, పీఎం 2.5...60 మిల్లీగ్రామ్స్‌కు మించకూడదు. కానీ, దీపావళి పండగ తరువాత ఈ రెండు కేటగిరీల్లోనూ రెండు, మూడు రెట్లు అధికంగా నమోదుకావడం గమనార్హం. ఇదిలావుంటే గడిచిన మూడు, నాలుగేళ్లతో పోలిస్తే ఈ ఏడాది పీఎం 10, పీఎం 2.5 నమోదులో పెద్దగా తేడాలు లేనట్టు పర్యావరణ ఇంజనీర్ పి.ముకుందరావు తెలిపారు.

ప్రాంతం	పీఎం10	పీఎం-2.5	పీఎం-10	పీఎం-2.5
	(గడిచిన గురువారం)		(దీపావళి రోజు)	
మింది	121	45	301	121
ఆటోనగర్	122	44	241	84
పోలీస్ బ్యారెక్స్	124	66	274	131
ఈఎస్ఐ హాస్పిటల్	121	54	132	107
సీతమ్మధార	85	36	221	97
జ్ఞానాపురం	134	53	307	108
పెదగంట్యాడ	129	57	193	93
రాంకీ	115	46	149	76
ఎంవీపీ రైతుబజార్	89	32	266	122
జీవీఎంసీ కార్యాలయం	189	52.2	233	110.4

బస్సు సౌకర్యం కల్పించండి



డీపీటీవో అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

అగనంపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లంకెలపాలెం, అగనంపూడి శనివాడ వేపచెట్టు జంక్షన్, జాబిలిహిల్స్ మీదుగా స్టీల్ ప్లాంట్ సెక్టార్ 121 వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆర్టీసీ డీపీటీవో అప్పలనాయుడును 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్ నుంచి అగనంపూడి, లంకెలపాలెం రావాలంటే కూర్మన్నపాలెం తిరిగి రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బస్సు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై డీపీటీవో సానుకూలంగా స్పందించినట్టు కార్పొరేటర్ తెలిపారు.

కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠ



వెంకన్న ఆలయ ప్రాంగణంలో కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న ఆలయ ధర్మకర్త

పెదగంట్యాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాంబేకాలనీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరాలయం ఆవరణలో శుక్రవారం కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ ఆధ్వర్యంలో స్వామి సన్నిధిలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గౌరవ ఆచార్యులు రమణానంద స్వామి, ప్రధాన అర్చకులు ప్రదీప చంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. స్వామి సేవకులు ఎం.అప్పలరెడ్డి, కొవిరి సత్యారావు, గొరుసు రామలక్ష్మి, బి.ఉషారాణి, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. కార్తీక మాసం సందర్భంగా శ్రీవేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించారు.

త్రిశక్తి ఆలయంలో లక్ష్మీదేవి పూజలు

ఉక్కు టౌన్ షిప్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో దీపావళి సందర్భంగా ఘనంగా లక్ష్మీదేవి పూజ నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో ఉన్న మహాదుర్గా, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సినిమా గైడ్

● **వీనస్ :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **పొట్టేల్ :** వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఎంతపనిచేసావ్ చంటి :** వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **లగ్గం :** విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)

● **దేవర :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● **వేట్టయాన్ :** సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **విశ్వం :** శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 44, టమాటా 36, వంకాయలు (తెలుపు)48, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 30, పచ్చిమిర్చి 42 కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 60, క్యాబేజి 30, క్యారెట్ 60 దొండకాయలు 32, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)60, బరబటి 44, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 46, దోసకాయ 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 34, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన 5, చుక్కకూర 4, పాలకూర 4, తోటకూర 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

రహదారుల మరమ్మతుకు శ్రీకారం

గాజువాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో అధ్వానంగా ఉన్న రహదారులకు మోక్షం కలిగింది. గాజువాక ప్రాంతంలో రోడ్లన్నీ చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో రోడ్లు గోతులమయంగా మారాయి. ప్రధాన రోడ్లతో పాటు వీధి రోడ్లు కూడా పూర్తిగా పాడైపోయాయి.దీంతో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యల నెలకొనేది. ఇక చిన్నపాటి వర్షం పడినా పరిస్థితి దారుణంగా తయారయ్యేది. గోతుల్లో వర్షం నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు నరకయాతన పడ్డారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలు ప్రజా సంఘాలు ఎన్నో సార్లు ఆందోళనలు, ధర్నాలు చేపట్టారు. ఈ క్రమంలో గడిచిన వారం రోజుల నుంచి పారిశ్రామిక ప్రాంతంలో అధ్వానంగా తయారైన రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతు చేసిన అనంతరం గాజువాక వంద అడుగుల రోడ్డు

పారిశ్రామిక ప్రాంతంలో సందడిగా దీపావళి



దీపకాంత వెలుగులో తిరుమల నగర్

ఆటోనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి టపాసుల హోరుతో పారిశ్రామిక వాసుల కళ్లలో ఆనందం వెల్లి విరిసింది. గురువారం సాయంత్రం చిన్న, పెద్ద అంతా దీపాల దీపావళి పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నా రు. సంప్రదాయాన్ని పాటిస్తూ చెరకు, ఆముదం, గోగుకర్రలతో ముస్తాబు చేసిన దివిటీలను పట్టుకున్న పలువురు తూర్పు అభిముఖంగా నిల్చొని దేవుడి కొలువులో ఉన్న పెద్దలకు మేలు జరగాలని కోరుతూ భక్తితో మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి బాపసంచాను వెలిగించి దీపావళి పండుగకు స్వాగతం పలికారు. తారాజువ్వలు, మతాబులు, చిచ్చు బుడ్లు, టపాసుల వెలుగులతో కాలనీలలోని ప్రజలు ఆనంద డోలికలలో తేలియాడారు.

ఏకో వైజాగ్‌లో భాగంగా గ్రీన్, క్లీన్, సేఫ్, ఆరోగ్య దీపావళిని గురువారం తిరుమలనగర్ కాలనీవాసులు జరుపుకున్నారు. ఇళ్ల ముందు వివిధ రంగులతో రంగవల్లులను తీర్చిదిద్ది, మట్టి ప్రమిదల్లో దీపారాధన చేసి ఇళ్ల ముంగిట, పరిసరాల్లో చెట్లు వద్ద,ఇంకుడు గుంతలు వద్ద దీపాలతో ప్రకృతి ఆరాధన శ్రేయస్కరమని, పర్యావరణ పరిరక్షణ తమ ధ్యేయమని తెలిపారు.

జీవీఎంసీ 87వ వార్డు సంతమామిడి తోటలో గురువారం కూర్మన్నపాలెం శిష్ట కరణ సంఘం ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్, సత్యారావు, గోపాల్ (గంగవరం గోపి), వి.ప్రసాద్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'అమరజీవి'కి నివాళులు

అగనంపూడి, నబంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి సత్రం జంక్షన్‌లో గల మహాత్మా గాంధీ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన పొట్టి శ్రీరాములను స్మరించుకొని ఆయన విగ్రహానికి సంస్థ అధ్యక్షుడు చిత్రా రామారావు పూలమాల లు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు శ్రీరాములు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గవర గున్న య్య, వసంతరావు, నాయుడు,సుబ్బారావు, వెంకటరావు పాల్గొన్నారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ అటాంట శ్రీనివాసరావు పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హెచ్ఎం కృష్ణారావు పాల్గొన్నారు.



అగనంపూడి : నివాళులు అర్పిస్తున్న రామారావు తదితరులు



కూర్మన్నపాలెం : శ్రీరాములుకు ఆర్యవైశ్య సంఘం సభ్యుల నివాళి

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం : వడ్లపూడి ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆధ్వర్యం లో శుక్రవారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘధ్యక్షుడు కారుమూరి మహేశ్, ప్రతినిధులు సూర్యనారాయణ,రామకృష్ణ, కె.మధుసూదన శెట్టి, కె.వీర్రాజు,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



ఏఐటీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర సమితి సభ్యుడు వెంకటరావు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ఏఐటీయూసీ ముందుకు సాగుతోందని రాష్ట్ర సమితి సభ్యుడు బూసి వెంకటరావు అన్నారు. యూనియన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్టీల్‌ప్లాంట్‌లో గురు వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ కార్మిక సమస్యలపై అలుపెరుగని పోరాటం సాగిస్తున్నదని అన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గం అభ్యున్నతి, వారి సమస్యలు పరిష్కరించేందుకు ఎన్నో పోరాటాలు యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టామన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చుక్కా శ్రీనివాసరావు, జి.తిరుపతిరావు, రాజు, తులసి పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయంలో దీపావళి పూజలు

శ్రీనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 71 వార్డు శ్రీనగర్‌లో శ్రీకృష్ణ, గణపతి, రమా సహిత సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో శుక్రవారం దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు ఫణి భూషణరావు శర్మ పర్యవేక్షణలో స్వామి వారికి తొలి పంచామృతాలతో అభిషేకాలతో అష్టోత్తర శతనామాలతో తులసీ అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూలతో అలంకరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కరేటి సహదేవరావు, లక్ష్మణరాజు, శ్రీనివాసరాజు,సూర్యనారాయణ, కృష్ణమునీంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీపరమేశ్వరుల ఊరేగింపు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వర మహోత్సవాల్లో భాగంగా గురువారం నందీశ్వరుల ఊరేగింపు నిర్వహించారు. పార్వతీ సమేత నందీశ్వరుల ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, బాణసంచా మధ్య కాలనీలో పెద్ద ఎత్తున ఊరేగించి ఉత్సవ వేదిక వద్ద ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మహిళలు

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

» ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలో శుక్రవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇస్తున్నామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిపోయిందని,గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, పార్టీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, జోనల్ కమిషనర్ శేషాద్రి, ఏపీడీ కె.దుర్గాప్రసాద్, నాయకులు ఆడారి రాము, తిప్పన బలరాం తదితరులు పాల్గొన్నారు.

బెల్ సొసైటీ సభ్యులకు కానుకలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సభ్యులందరి సహకారంతో సొసైటీ అభివృద్ధికి పాలక వర్గం పూర్తి కృషి చేస్తుందని బెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయిస్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు కె.రామునాయుడు అన్నారు. దీపావళి సందర్భంగా సొసైటీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సొసైటీ సభ్యులకు దీపావళి కానుకలను పాలక వర్గం అందజేసింది. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మండ వెంకటరాజు, డైరెక్టర్లు జీటీపీ ప్రకాష్, గెద్దాడ ప్రసాద్, కె.ధర్మారావు, కె.నాగవరప్రసాద్, ఎస్‌బీ ప్రశాంత్, వి.గోవిందరావు, మేనేజర్ గవర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిషేధ ప్రాంతంగా స్టీల్‌ప్లాంట్

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్, పరిసర ప్రాంతాలను నిషేధ ప్రాంతంగా గుర్తించారు.అనుమతి లేకుండా ప్రవేశ, నిష్క్రమణ చేయరాదని ఉక్కు యాజమాన్యం పేర్కొంది.ప్లాంట్ ప్రహరీ లోపల, పరిపాలన భవనం, హిల్‌టాప్ గెస్ట్‌హౌస్, టీటీఐ భవ నం, ప్రాజెక్టు ఆఫీసు కార్యాలయం, సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్, సీఐఎస్ఎఫ్ పరిపాలన భవనంలో అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చే సింది.నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని యాజమాన్యం పేర్కొంది.

దుర్గమాంబ ఆలయంలో పూజలు



అగనంపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గ మాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బ్రాహ్మమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్రా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరి విడనాడాలి : యూపీపీసీ చైర్మన్ మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై కేంద్రం ద్వంద వైఖరి విడనాడాలని, ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలనీ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. కూర్మన్నపాలెంలో పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న 1359 రోజుల రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న కార్మికుల నుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వరంగాల పై కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు తగవన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల బదిలీ

ఉత్తర్వులు విడుదల చేసిన జీవీఎంసీ కమిషనర్

వెంకోజీపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలోని పట్టణ ప్రణాళిక అధికారుల అంతర్గత బదిలీలను చేపడుతూ కమిషనర్ పి.సంపత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటి వరకు జోన్-1 నుంచి జోన్ 4 వరకు సిటీ ప్లానర్ -1గా, జోన్1 నుంచి జోన్ 2 వరకు డీసీపీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న కె.ధనంజయరెడ్డిని జోన్ 1 నుంచి 4 వరకు సిటీ ప్లానర్ -1 గా నియమించారు. జోన్ 5 నుంచి జోన్ 8 వరకు సిటీ ప్లానర్ -2గా, జోన్ 3, జోన్ 4 డీసీపీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న సీపీ-2 విత్తనాల మీనా కుమారిని జోన్ 5 నుంచి జోన్ 8 వరకు సిటీ ప్లానర్-2 గా బదిలీ చేశారు. జోన్ 5, 7, 8తో పాటు ప్రకటన వింగ్ డీసీపీగా పనిచేస్తున్న టీజీ రామ్మోహన్‌ను జోన్ 5 నుంచి 8 డీసీపీ-2గా మార్చారు. జోన్ 6 ఏసీపీగా పనిచేస్తున్న కె.హరిదాస్‌ను జోన్ 1 నుంచి 4 వరకు డీసీపీ-1 ఇన్‌చార్జిగా, జోన్-7 ఏసీపీ, టీపీవో ఇన్‌చార్జి, టీపీబీఓ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఏసీపీ యు.రామకృష్ణను జోన్-1 ఏసీపీగా బదిలీచేశారు. జోన్-1 ఏసీపీగా, టీపీవో ఇన్‌చార్జిగా, టీపీబీవో ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఏసీపీ ఎం.తిరుపతిరావును జోన్-2 ఏసీపీగా, జోన్3 ఏసీపీగా పనిచేస్తున్న సీహెచ్ మధుసూధనరావును జోన్-3 రిటైన్డ్ ఏసీపీగా, జోన్-4 ఏసీపీ కె.జాన్సీలక్ష్మిని జోన్-4 రిటైన్డ్ ఏసీపీగా, జోన్-2 ఏసీపీ, టీపీవో, టీపీబీఓ ఇన్‌చార్జిగా చేస్తున్న ఏసీపీ ఎస్.సత్యసబ్బన్‌ను జోన్-5 ఏసీపీ, ప్రకటనల ఇన్‌చార్జిగా నియమించారు. జోన్-5 ఏసీపీ కె.వెంకటరావును జోన్-6 ఏసీపీ, జోన్-7 ఇన్‌చార్జి ఏసీపీ, జోన్-6 ఇన్‌చార్జి డీసీపీ, ప్రకటనల ఏసీపీగా చేస్తున్న వి.రామలింగేశ్వరరెడ్డిని జోన్-8 ఏసీపీగా, జోన్-4 టీపీవో కె.పద్మను జోన్-8 టీపీవోగా, జోన్-6 టీపీవో, ఇన్‌చార్జి టీడీబీవో గా చేస్తున్న టీపీవో ఓ.వరప్రసాద్‌ను జోన్ 6 టీపీవో, ఇన్‌చార్జి టీపీఎస్, రిటైన్డ్ జోన్ 6 గానూ, జోన్ 8 టీపీవో, ఇన్‌చార్జి ఏసీపీ, ఇన్‌చార్జి టీపీఎస్ జి.బాలరాజును జోన్2 టీపీవో, ఇన్‌చార్జిగా టీపీఎస్‌గా, ఎన్‌ఫోర్స్‌మెంట్‌వింగ్ ఇన్‌చార్జి, ఎస్టేట్ అధికారి టీపీవో సి.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను జోన్ 5 టీపీవో, ఇన్‌చార్జి టీపీఎస్‌గా బదిలీ చేశారు. టీపీవో వి.కొండలరావును జోన్-4 టీపీవోగా,ఇన్‌చార్జి టీపీఎస్‌గా, టీపీవో పి.కనకరావును జోన్-7 టీపీవో, ఇన్‌చార్జిగా టీపీఎస్‌గా, టీపీవో వి.వాణిని జోన్-3 టీపీవోగా, జోన్-3 టీపీఎస్, ఇన్‌చార్జి టీపీవో టీపీఎస్ ఎస్.గోపన్నను జోన్-8 టీపీఎస్‌గా, జోన్ 4 టీపీఎస్ సిహెచ్.వి.నారాయణరావును జోన్-3 టీపీఎస్, జోన్ 4 టీపీఎస్, ఇన్‌చార్జి టీపీవో టీపీఎస్ విజయకుమార్‌ను జోన్-1 టీపీఎస్‌గా, ఇన్‌చార్జి టీపీవోగా మార్పు చేశారు. సిటీప్లానర్-1కు అర్బన్ రీసర్వే, ఎస్టేట్ వింగ్, స్లమ్స్, టీడీఆర్ సమస్యలు, కౌన్సిల్ మీటింగ్, మాస్టర్ ప్లాన్, మాస్టర్‌ప్లాన్ రోడ్లు, కోర్టు కేసుల మోనిటరింగ్, ఏపీడీపీఎంఎస్, ఎల్‌టీపీ మార్పు/బిల్డర్ రిజిస్ట్రేషన్, ఆఫీసు ఎస్టాబ్లిష్‌మెంట్, యూసీఎస్, పేపర్ క్లిపింగ్స్ (అచీవ్‌మెంట్ అండ్ అడ్వర్స్ న్యూస్), రీజాయిండర్స్, డయల్ యువర్ మేయర్, సీఓసీ, ప్రజావాణి, కమిషనర్ రివ్యూలు, వీఐపీ సిఫార్సులు, పార్కింగ్ సమస్యలు, ఎల్ఆర్ఎస్, ఫైర్ వింగ్, టూరిజంలను అప్పగించారు. సిటీ ప్లానర్-2 కు సీఅండ్‌డీ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఆర్‌టీఐ, హౌసింగ్, పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్, డబ్ల్యూపీఆర్ఎస్ ఎస్టాబ్లిస్‌మెంట్ వర్క్‌లు, డ్రాయింగ్/జీఐఎస్‌వింగ్, ప్రకటనలు, ఈవెంట్ అనుమతులు, డీపీసీ మీటింగ్‌లు, సమస్యలు, రోడ్డు సేఫ్టీ అండ్ ట్రాఫిక్ కమిటీ సమావేశాలు, సమస్యలు, బడ్జ్ సమస్యలు, ఆడిట్ పారాస్, ఏపీపీసీబీ అండ్ సీఆర్‌జెడ్, స్ట్రీట్ వెండర్స్ పాలసీ, ఎలక్షన్స్, విపత్తుల మేనేజ్మెంట్‌ను అప్పగించారు.

అభిజిత్ కంపెనీ అక్రమ లే ఆఫ్‌పై కార్మికుల నిరసన

కూర్మన్నపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ అక్రమ లే ఆఫ్‌ను ప్రకటించి ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం ఆ కంపెనీ కార్మికులు, సీఐటీయూ నాయకులతో కలసి ర్యాలీగా దువ్వాడ వీఎస్ఈజెడ్‌కు శుక్రవారం తరలివచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్మిక నాయకులు రొంగలి రాము, వీవీ రమణ మాట్లాడుతూ అభిజిత్ కంపెనీ లే ఆఫ్‌ను ఎత్తివేసి కంపెనీని వెంటనే తెరవాలని, తొలగించిన కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని, కార్మికుల బకాయి జీతాలు,దసరా బోనస్‌లు చెల్లించాలని, కార్మిక చట్టాలు అమలు చేయని యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రమ్య, వీఎస్ఈజెడ్ ఏడీసీ ప్రసన్న కుమార్‌ను కార్మికులు కలిసి వినతి పత్రం అందజేశారు.

దీనిపై అధికారులు మాట్లాడుతూ అక్రమ లే ఆఫ్ సమాచారం తెలుసుకున్న వెంటనే అభిజిత్ కంపెనీకి షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. చట్ట ప్రకారం కార్మికులు రావాల్సిన బకాయిలు, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామనీ, అభిజిత్ కంపెనీపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కార్మికులకు హామీ ఇచ్చారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ధర్నా చేస్తున్న అభిజిత్ ఫెర్రో టెక్ కార్మికులు

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే గణబాబు



సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు అన్నారు. 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో శుక్రవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకర్, టీడీపీ సీనియర్ నాయకుడు పూడి భాస్కరరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు రామ్మోహన్ నాయుడు, జోన్ 5 కమిషనర్ రాము, ఏపీడీవో కృపానందం పాల్గొన్నారు.

10 నుంచి ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు

గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో సాయిబాబా గుడి పక్కనున్న మైదానంలో ఈనెల 10వ తేదీన రాష్ట్రస్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీలు జర గనున్నాయి. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే గణబాబు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.

మర్రిపాలెం (పశ్చిమ) : ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఆయన 57వ వార్డు మర్రిపాలెం రామునాయుడు కాలనీలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, సివిల్ సప్లైస్ ఆర్ఐ మణికంఠ, 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, 57వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజేయ్‌బాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జి అంగ ప్రశాంతి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

గోపాలపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లోని ప్రధాన రహదారి పక్కనున్న జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 11 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు అప్రమత్తమై, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. గత కొద్ది రోజులుగా కార్యాలయం తెరవలేవడం లేదని, ప్రమాదానికి గల కారణాలు తెలియదని పార్టీ నాయకులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదంపై ఆరా తీస్తున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

పెందుర్తి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడ మొత్తం 16 సాగునీటి చెరువులు ఉండగా, 16 సంఘాలు ఉన్నాయి. పదేళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో చెరువుల నిర్వహణ కుంటుపడింది. దీంతో చెరువులన్నీ పూడికలు, తుప్పలతో నిండిపోయాయి. పంట కాలువలు కూడా పాడయ్యాయి. చెరువుల నుంచి చుక్క నీరు కిందకు రాని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రకటన చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

వుడా కాలనీలో రోడ్డు విస్తరణ పనులు

పెందుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ బీఆర్‌టీఎస్ రహ దారి మీదుగా వుడాకాలనీ జోగులాంబ బస్టాప్ దరి వీఎంఆర్‌డీఏ ఫంక్షన్ హాల్ వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈమేరకు గురువారం 8వ జోన్ ఇంజనీరింగ్ అధికారులు మ్యాపింగ్ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్, ముదునూరి రాజా సుధాకర్, అయిత సింహాచలం, సేనాపతి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ సిటీలో దీపావళి సంబరాలు

కూర్మన్నపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 88 వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూపు గ్రీన్ సిటీలో దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమాన్ని వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేష్‌కుమార్, వివి కృష్ణారావు ప్రారంభించారు.అనంతరం చిన్నా, పెద్ద అన్న తారతమ్యం లేకుండా అందరూ క్యాకర్స్ షోలో మునిగి తేలారు. ఈ సందర్భంగా బండి సురేష్ కుమార్ మాట్లాడుతూ గ్రీన్ సిటీ ఓ సమైఖ్య కుటుంబంలా ఉంటుందని, ఉమ్మడిగా ఐకమత్యంగా ఉండాలన్న సందేశం భావి తరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో సమైఖ్య దీపావళిని నిర్వహించామన్నారు.

పారిశుధ్యం పనులు పరిశీలన

ఎన్ఏడీ జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ఉన్న కొండవాలు ప్రాంతంలో పారిశుధ్యం పనులను కార్పొరేటర్ బొమ్మిడి రమణ శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు దొడ్డి జగన్, పి.కోటి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

92.41 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు నెల మొదటి రోజునే 92.41 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. 1,49,668 మంది లబ్ధిదారులకు రూ.64,23,58,500లు పంపిణీ చేశారు. అత్యధికంగా పద్మనాభంలో 94.51 శాతం, భీమునిపట్నం 94.28 శాతం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతంలో 93.79 శాతం 25,158 మందికి, అర్బన్‌లో 92.13 శాతం 1,24,510 మందికి పింఛన్లు అందజేశారు. వివిధ కారణాలతో 12,301 మందికి శని, ఆదివారాల్లో అందజేయనున్నారు.

ఆకాశంలో అద్భుత కాంతులు



సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వద్ద మహిళల దీపావళి సంబరాలు

- దేదీప్యమానంగా దీపావళి
- బాణసంచాతో సందడే సందడి
- అర్ధరాత్రి వరకు మోతెక్కిన పరిసరాలు
- సంబరాలు చేసుకున్న జిల్లా వాసులు

జిల్లాలో దీపావళి పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సాయంత్రం మహిళలు మహాలక్ష్మికి పూజలు చేసిన అనంతరం ఇళ్లను దీపాలతో అందంగా అలంకరించారు. కార్తీకదీపాలను గాలిలోకి వదిలారు. బాణసంచా కాల్చడంలో చిన్నా పెద్దా పోటీ పడ్డారు. మతాబులు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలతో ఆకాశం అద్భుత కాంతులు అలముకుంది. బాంబుల శబ్దాలతో నగరంతో పాటు ఇతర ప్రాంతాలు దద్దరిల్లాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



కళ్లు మిరిమిట్లు గొలిపేలా...



సీతమ్మధార రహదారిలో దీపావళి సందడి







ఆక్సిజన్ టవర్స్ వద్ద బాంబుల మోత



కూర్మన్నపాలెం గ్రీన్‌సిటీలో సామూహిక దీపావళి వేడుకలు



ఆకాశదీపాన్ని వదులుతున్న యువతులు

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి



సూర్యకుమారి (ఫైల్)

సీతంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చీరకు నిప్పంటుకుని ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన తాటిచెట్లపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటిచెట్లపాలెంలో ఉంటున్న దార్లపూడి సూర్యకుమారి (93) పండగకు ఇంటి గుమ్మం వద్ద వెలిగించిన దీపం డోర్‌కర్టెన్‌కు అంటుకుంది. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా ఆమె చీరకు అంటుకున్నాయి. దీంతో తీవ్రంగా గాయడింది. వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందారు. ఆమె మనుమడు బద్రీనాథ్ ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

ఎండాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పూటుగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురవాడ మిథిలాపురి ఉడాకాలనీ యాలకుల జోగినాయుడు (45) భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులతో నివసిస్తున్నాడు. జోగినాయుడు దసరా నుంచి పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. అతనికి ఫిట్స్ ఉంది. గురువారం సాయంత్రం ఆర్టీసీ డిపో వద్ద అపస్మారక స్థితిలో ఉండడాన్ని స్థానికులు గమనించి తెలిపారు. అప్పటికే అతడు మృతి చెందాడు. ఫిట్స్‌తో చనిపోయి ఉంటాడని పోలీసులకు తెలిపారు.

ఆరోగ్యదాయకం.. కార్తీకం!



నదీ స్నానంతో బహుళ ప్రయోజనం

- వ్యాధి నిరోధక శక్తి పెరిగే అవకాశం
- ఉపవాస దీక్షతో నూతనోత్తేజం
- వన భోజనాలతో సర్వమానవ సౌభ్రాతృత్వం
- నేటి నుంచి కార్తీకమాసం

కూర్మన్నపాలెం/ సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): **హరి,హరులకు ప్రీతికరమైనదిగా భావించే కార్తీకమాసం సర్వ మానవాళికిగా ఆరోగ్య ప్రదాయిని. ఈ మాసంలో ఆచరించే అనేక నియమాలు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో సహాయపడతాయి. ప్రాతఃకాలంలో నదీ స్నానం, దీపారాధన, ఉపవాస దీక్ష, వనభోజనం ఇలా... అన్నింటికీ ప్రత్యేకత ఉంది. ఆధ్యాత్మిక చింతన ఉంటే అన్నీ దరిచేరుతాయని, వాటిని నియమానుసారం పాటిస్తే ఫలితాలు లభిస్తాయని పెద్దల ఉవాచ. ఈ నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణకు పాటించాల్సిన నియమాలన్నింటినీ ఆధ్యాత్మికతతో మేళవించి అందించారు. ఈ మాసమంతా వీటిని పాటిస్తే పరిసరాల పరిశుభ్రతతో పాటు చక్కని ఆరోగ్యం, సర్వమానవ సౌభ్రాతృత్వం అలవడతాయని ప్రతీతి.**

నేటి యువతకు మన పండుగలు, వాటి విశిష్టత తెలియడం లేదు. వాటి ప్రాముఖ్యతను అందికీ తెలియజేయాల్సిన అవసరం ఉంది. కార్తీకమాసంలో ఆచరించాల్సిన నియమాలు, పాటించాల్సిన పద్ధతులు వివరించి, అంతా ఆచరించేలా చేస్తే ఆరోగ్య రహస్యాలు అవగతమవుతాయి. ఆచార వ్యవహారాలు, నియమ నిబంధనలలో పూర్వీకులు ఆరోగ్య రహస్యాలను పొందుపరిచారు. వాటిని పాటించకపోవడంతోనే శారీరక రుగ్మతలు పెరుగుతున్నాయి. ప్రస్తుతంతరం కార్తీకం అంటే కేవలం పిక్నిక్‌ల మాసంగా భావించే పరిస్థితి ఉంది.

ఆరోగ్యంగా ఉంచే ప్రాతఃకాలస్నానం

సాధారణంగా చలికాలం ఆరంభంలోనే కార్తీక మాసం వస్తుంది. ఈ సమయంలో నదులు, బావులు, సముద్రంలో చంద్రుని ప్రభావం అధికంగా ఉంటుంది. వేకువజామున వాటిలో స్నానమాచరిస్తే అనారోగ్య సమస్యలు తొలగుతాయి. జలుబు, దగ్గు, చీడ,పీడల నుంచి విముక్తి లభిస్తుంది. ప్రతిరోజూ శిరఃస్నానంతో కళ్లకు మేలు జరుగుతుంది. చల్లని నీటితో



స్నానం చేస్తే రక్తప్రసరణ సవ్యంగా సాగుతుంది. సాధారణంగా నదులు కొండల్లో పుడతాయి. అక్కడి ఔషధ మొక్కల ప్రభావం ఆ నీటిలో ఉంటుంది. అందులో స్నానమాచరిస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడంతో శరీరానికి బద్ధకం ఆవరిస్తుంది. దీనిని అధిగమించేందుకు తెల్లవారుజామునే నిద్ర లేవడం, చల్లని నీళ్లతో స్నానం చేయడం, ఆలయాలు, ఇంటి ఆవరణలోని తులసికోట చుట్టూ ప్రదక్షిణలు మేలు. పెద్దలు ఆధ్యాత్మికతకు ముడిపెట్టి చెప్పిన నియమాల్లో అంతర్లీనంగా ఆరోగ్య రహస్యాలు ఇమిడి ఉన్నాయి.

పరిశుభ్రతకు చిరునామా...

కార్తీకమాసంలో ప్రతిరోజూ ఇంటి ముందు ఆవుపేడతో కళ్లాపి చల్లి, ముగ్గులు పెట్టడం వల్ల క్రిమికీటకాలు తొలగిపోతాయి. ఆవుపేడలో బ్యాక్టీరియా, వైరస్‌లను నాశనం చేసే రసాయనాలుంటాయి. దీనవల్ల వ్యాధులు దూరమవుతాయి. ఫలితంగా ఆరోగ్యం సిద్ధిస్తుంది. తులసి మొక్క చుట్టూ ప్రదక్షిణ చేస్తే దాని మీదుగా వచ్చే గాలి అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది.

ఉపవాసంతో సత్ఫలితాలు

కార్తీకమాసంలో ఉపవాసం చేయడం ఆనవాయితీ. శరీరంలోని అవయవాలు చైతన్యవంతం కావడానికి ఇది ఉపయోగపడుతుంది. అన్నానికి బదులు పండ్లు తినడం వలన ప్రొటీన్లు, ఖనిజ లవణాలు, విటమిన్లు, పుష్కలంగా లభిస్తాయి. పగలంతా ఉపవాసం ఉండి రాత్రి ఆహారం తీసుకుంటే గ్యాస్ట్రబుల్‌తో బాధపడే వారికి ఉపశమనం లభిస్తుంది.


అందరినీ కలిపే వన భోజనం

కార్తీకమాసంలో వన భోజనం ఆరోగ్యమని పురాణాలు చెబుతున్నాయి. ధాత్రి దేవిని పూజించి ఉసిరి చెట్లున్న వనంలో భోజనాలు చెయ్యడం వలన పుణ్యప్రాప్తి కలుగుతుంది. ఉసిరి చెట్లను తాకుతూ వచ్చే గాలి ఔషధ గుణాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అంతేకాదు మానవులంతా ఒక్కటే అనే సర్వమానవ సౌభ్రాతృత్వానికి తార్కాణంగా వనభోజనాలకు ప్రతీతి. సాధారణంగా కార్తీకమాసంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మిత భోజనం, రాత్రి పండ్లు పాలు తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన అన్ని రకాల ఖనిజాలు, ప్రొటీన్లు, లవణాలు అందడంతో నూతనోత్తేజం కలిగి, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది.

ఉక్కు బీఎఫ్-1లో ఉత్పత్తి ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ -1 (గోదావరి) విభాగంలో ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమైంది.గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు స్టీల్ మెల్ట్ షాప్-1లో 17 హీట్‌లు (పెద్ద సైజు కలిగిన ఇనుప దిమ్మలు), 2లో 26 హీట్‌లు కలిపి మొత్తం 43 హీట్‌లు వచ్చాయి. ప్లాంట్‌లో రెండు ఫర్నేస్‌లలో ఉత్పత్తి సాగితే అన్ని విభాగాల్లో ఉత్పత్తి పెరుగుతుంది.

తవ్వకాల్లో బయటపడిన అమ్మవారి విగ్రహం



పూజలందుకుంటున్న విగ్రహం

పెందుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం చదును చేస్తుండగా అమ్మవారి విగ్రహం బయటపడడంతో ప్రజలంతా పూజలు చేస్తున్నారు. ఈ ఘటన పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన గ్రంధి నాగిశెట్టి గురువారం ఇంటి పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాన్ని తవ్వించేందుకు కూలీలను నియమించారు. వారు పునాదుల కోసం మట్టిని తవ్వుతుండగా అమ్మవారి విగ్రహం బయటపడింది. విగ్రహానికి ఒక చేయి లేకపోవడంతో కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహమని సిద్ధాంతులు వివరించారు. ఈ గ్రామానికి చెందిన విగ్రహమేనని, కాలక్రమంలో కనుమరుగయిందని చెబుతున్నారు. విగ్రహం లభ్యంకావడంతో స్థానికులు పూజలు చేస్తున్నారు.

ఐఐటీ బీహెచ్‌యూలో సత్తాచాటిన శృతి



కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ నుంచి స్వర్ణపతకాన్ని అందుకుంటున్న శృతి

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో నగరానికి చెందిన విద్యార్థిని శృతిరాగమయి సత్తాచాటారు. ఐఐటీ అందించే బీటెక్ కోర్సుల్లో స్వర్ణపతకం సాధించినదక్షిణ భారత విద్యార్థినుల్లో ఒకరుగా నిలిచారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ ఘనత సాధించిన శృతిరాగమయి. విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతులమీదుగా స్వర్ణపతకాన్ని అందుకున్నారు. శృతి మర్రిపాలెంలోని కేంద్రీయ విద్యాలయ-1లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ద్వారకానగర్ పిట్జీలో ఇంటర్ పూర్తి చేశారు. ఐఐటీ బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్‌లో ప్రతిభ చూపి బంగారు పతకాన్ని అందుకున్నారు.

ఉచిత గ్యాస్‌తో ఆర్థిక చేయూత

- సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- గ్రోత్ హబ్‌గా మారనున్న విశాఖ
- సిలిండర్ల పంపిణీలో కలెక్టర్‌హరేంధిర ప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పేదలకు ఆర్థిక చేయూతనిస్తుందని సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం జనరంజక పాలనను అందిస్తోందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. గాజువాక కణితి రోడ్డులో శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పేదల్లో ఇప్పటికీ చాలామంది కట్టెల పొయ్యిలను వినియోగిస్తూ శ్వాసకోస వ్యాధులతో మృత్యువాత పడుతుండడాన్ని గుర్తించిన ప్రభుత్వం ఉచిత సిలిండర్ల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. పథకం అమలులో ఇబ్బందులుంటే 1967 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్‌చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సహాయ సహకారంతో విశాఖ మహానగరాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కేంద్ర, రాష్ట్ర డబుల్ ఇంజన్ సర్కార్లతో రాష్ట్రం అన్నిరంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ అభ్యున్నతికి కేంద్రం తోడ్పాటునిస్తుందని, విశాఖ రైల్వేజోన్‌తో పాటు, అనేక సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ముందకొస్తున్నాయన్నారు.



గ్యాస్‌సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్, వేదికపై గాజువాక ఎమ్మెల్యే పల్లా, జేసీ, ఎమ్మెల్సీ తదితరులు

అనేక ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం దూసుకుపోతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టంచేశారు. పేదల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దీపం పథకాన్ని దీపావళి కానుకగా ప్రజలకందించినట్టు తెలిపారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం అర్హులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, ఆర్డీవో శ్రీలేఖ, డీఎస్‌ఓ భాస్కరరావు, ఎమ్మెల్సీ రామారావు, సర్కిల్ 3 ఏఎస్‌ఓ కృష్ణ, కరణంరెడ్డి నరసింగరావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, మూర్తి, రామారావు, రమణారెడ్డి, రఫీ, ముర్తజా తదితరులు పాల్గొన్నారు.